


	కనిష్ఠం	గరిష్ఠం
ఖమ్మం	24	36
భద్రాద్రి	22	35



ఇఫ్తార్ : 6:25 (ఆదివారం)
సహర్ : 4:55 (సోమవారం)

కేంద్ర ఎన్నికల సంఘం లోక్‌సభ ఎన్నికలకు నగారా మోగించింది. ఊహించిన విధంగానే లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ శనివారం విడుదలైంది. ఉమ్మడి జిల్లాలోని ఖమ్మం, మహబూబాబాద్ లోక్‌సభ నియోజకవర్గాల పరిధిలో ఎన్నికల నిర్వహణకు అధికార యంత్రాంగం కసరత్తు ప్రారంభించింది. ఏప్రిల్ 18 నామినేషన్ల పర్వం మొదలుకానుండగా, మే 13న ఎన్నికలు, జూన్ 4న కౌంటింగ్ నిర్వహించనున్నారు. ఇక షెడ్యూల్ విడుదలతో రాజకీయ సందడి ఊపందుకుంది. ప్రధాన పార్టీలు ఎన్నికల రణక్షేత్రంలోకి దిగేందుకు సర్వ సన్నద్ధం అవుతున్నాయి. ఉమ్మడి జిల్లాలోని రెండు సీట్లలో మహబూబాబాద్‌లో కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ అభ్యర్థులు ఖరారు కాగా, ఖమ్మం ఎంపీ స్థానంలో కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులపై సస్పెన్స్ కొనసాగుతోంది. ఇక్కడ బీఆర్ఎస్ అభ్యర్థిగా సిట్టింగ్ ఎంపీ నామా నాగేశ్వర్‌రావును ఖరారు చేసిన విషయం విదితమే.

- ఏప్రిల్ 18 నుంచి నామినేషన్లు..
- మే 13న ఎన్నికలు.. జూన్ 4న ఫలితాలు...
- అమల్లోకి వచ్చిన ప్రవర్తనా నియమావళి
- ఎన్నికల విధుల్లోకి అధికార యంత్రాంగం
- శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలకు బ్రేక్
- ఉమ్మడి జిల్లాలో ఖమ్మం, మహబూబాబాద్ లోక్‌సభ నియోజకవర్గాలకు ఎన్నికలు
- రెండు జిల్లాల్లో ఓటేయనున్న 22 లక్షల మంది



మోగిన రణభేరి

లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ విడుదల

ఖమ్మం, మార్చి 16 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఎన్నికల షెడ్యూల్ ఖరారు కావడంతో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. శనివారం ఒక్కసారిగా అంతా ఎన్నికల మూడ్‌లోకి వచ్చేశారు. రెవెన్యూ, పోలీసులతోపాటు ఇతర ప్రభుత్వ శాఖలు ఎన్నికల సన్నాహాలపై బిజీకాగా, రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, జిల్లాలో పలువురు ఎమ్మెల్యేలు ప్రభుత్వ కార్యక్రమాలు, శంకుస్థాపనల్లో బిజీగా పాల్గొన్నారు. మంత్రి తుమ్మల జిల్లా కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహించి ఖమ్మం మార్కెట్ కమిటీలో దుస్తుల పంపిణీతోపాటు పలు కార్యక్రమాల్లో పాల్గొనగా మంత్రి పొంగులేటి నేలకొండపల్లి, కూసుమంచి మండలాల్లో పాల్గొన్నారు.

గడిచిన వారం రోజుల్లో ఇద్దరు మంత్రులతో పాటు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కూడా అభివృద్ధి కార్యక్రమాల్లో శంకుస్థాపనల్లో పాలుపంచుకున్నారు. ఎన్నికల షెడ్యూల్ దృష్టిలో పెట్టుకుని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు మరో 9మంది మంత్రులు ఈనెల 11న భద్రాచలం వచ్చి ఇందిరమ్మ ఇళ్ల పథకానికి శ్రీకారం చుట్టారు. మణుగూరులో ప్రజా దీవెన సభలో పాల్గొన్నారు. బీఆర్ఎస్, బీజేపీలు జిల్లాలో ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పలు కార్యక్రమాలు సాగించాయి.



ఏప్రిల్ 18 నుంచి నామినేషన్లు

ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఖమ్మం, మహబూబాబాద్ లోక్‌సభ నియోజక వర్గాలకు ఏప్రిల్ 18న నోటిఫికేషన్ విడుదల కానుంది. అదే రోజు నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కానుంది. ఖమ్మం లోక్‌సభకు కలెక్టర్ వీపీ గౌతమ్ రిటర్నింగ్ అధికారిగా వ్యవహరించనున్నారు. మహబూబాబాద్‌కు కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ రిటర్నింగ్ అధికారిగా వ్యవహరించనున్నారు. వీరు లోక్‌సభ నియోజకవర్గాల ఎన్నికల నిర్వాహణకు కసరత్తు ప్రారంభించారు. ఆదివారం విలేకరుల సమావేశంలో లోక్‌సభ ఎన్నికలపై వివరించనున్నారు.వచ్చే నెల 18నుంచి 25వరకు నామినేషన్ల స్వీకరణ, 26న పరిశీలన, 29న ఉపసంహారణ, మే13న పోలింగ్, జూన్ 4న కౌంటింగ్ జరగనుంది. ఎన్నికల షెడ్యూల్ రావడంతో రాజకీయ పార్టీల పోస్టర్లు, ఫ్లెక్సీలను తొలిగిస్తున్నారు. రాజకీయ పార్టీల నేతల విగ్రహాలకు ముసుగులు తొడుగుతున్నారు. ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలకు బ్రేక్ పడింది. ఎన్నికల కోడ్ పూర్తయ్యేవరకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ పథకాలకు , కార్యక్రమాలకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు ఉండవు. షెడ్యూల్ విడుదలైన వెంటనే శనివారం 4గంటలనుంచి కోడ్ అమల్లోకి వచ్చింది. ఖమ్మం లోక్‌సభ రటర్నింగ్ అధికారి విడుదల చేసిన ప్రకటనలో నిబంధనలు తెలియచేశారు.

సరిహద్దులపై నిఘా

ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో తెలంగాణ రాష్ట్ర సరిహద్దులకు ఉమ్మడి ఖమ్మంజిల్లా విస్తరించి ఉన్నందున సరిహద్దులపై నిఘా పెంచనున్నారు. ఇందుకోసం పోలీసు, ఎక్సైజ్, ఇన్‌కంట్యాక్స్ తదితర శాఖలు సంయుక్తంగా చెక్ పోస్టులను సరిహద్దుల్లో ఏర్పాటు చేయనున్నారు. కొన్ని చోట్ల పోలీసులు తనిఖీలు కూడా జరుపుతున్నారు. సరిహద్దు ఏపీలో కూడా ఇదే షెడ్యూల్‌లో లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్నందున తెలంగాణ నుంచి ఆంధ్రాకు డబ్బు సరఫరా అయ్యే అవకాశం ఉంది. దీంతో ఏపీ సరిహద్దులో ఈసారి పకడ్బందీగా నిఘా చర్యలు ఏర్పాటు చేయబోతున్నారు.

నియమావళిని అమలు చేయండి

లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ విడుదలైనందున నియమావళిని అమలు చేయాలని కలెక్టర్ వీపీ గౌతమ్ అధికారులను ఆదేశించారు. ఎన్నికల షెడ్యూల్ విడుదల నేపథ్యంలో రాజకీయపార్టీలకు చెందిన వ్యక్తుల ఫ్లెక్సీలు, గోడపై రాతలు తొలగించాలని, విగ్రహాలను వస్త్రంతో కప్పివేయాలని, ప్రభుత్వ కార్యాలయాలపైన, ప్రభుత్వ వెబ్‌సైట్లు, కేలండర్లపైన రాజకీయపక్షాల నాయకుల ఫొటోలు తొలగించాలని ఆదేశించారు.



6

ఎన్నికల నియమావళిని పకడ్బందీగా అమలుచేయాలి

- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్
- వీడియో కాన్ఫరెన్స్‌లో పలు అంశాల వెల్లడి
- పాల్గొన్న కలెక్టర్, సీపీ, కేఎంసీ కమిషనర్

విగ్రహాలకు ముసుగు... ఫ్లెక్సీల తొలగింపు..



కొత్తగూడెం టౌన్, మార్చి 16 : పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో జిల్లా కేంద్రమైన కొత్తగూడెంలో శనివారం అధికారులు రంగంలోకి దిగారు. కొత్తగూడెం పట్టణంలోని ప్రధాన రహదారులకు ఇరువైపులా ఉన్న పార్టీల జెండాలు, ఫ్లెక్సీలను తొలగించారు. ప్రభుత్వ నిదులతో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల శిలాఫలకాలకు సైతం వస్త్రాలతో కప్పేశారు. సూపర్‌బజారు సెంటర్‌లోని దివంగత నేత ఇందిరాగాంధీ, అండర్‌బ్రిడ్జి సమీపంలోని దివంగత మాజీ ముఖ్యమంత్రులు ఎన్టీ రామారావు, వైఎస్ రాజశేఖర్ రెడ్డి, మాజీమంత్రి కోనేరు నాగేశ్వరరావు విగ్రహాలకు ముసుగులు వేశారు. ఇటీవల ప్రజా ప్రతినిధులకు ఏర్పాటు చేసిన స్వాగత ఫ్లెక్సీలను సైతం తొలగించారు.

ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గం

నియోజకవర్గం	ఓటర్లు	పోలింగ్ కేంద్రాలు
ఖమ్మం	3,23,091	355
పాలేరు	2,39,510	289
మధిర	2,21,370	268
వైరా	1,92,586	252
సత్తుపల్లి	2,42,686	292
కొత్తగూడెం	2,47,669	253
అశ్వారావుపేట	1,58,223	184
మొత్తం	16,25,135	1,911

మహబూబాబాద్ లోక్‌సభ నియోజకవర్గం (భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పరిధి)

నియోజకవర్గం	ఓటర్లు	పోలింగ్ కేంద్రాలు
పినపాక	2,02,719	241
ఇల్లెందు	2,24,407	241
భద్రాచలం	1,51,888	176
మొత్తం	5,79,014	658



కాంగ్రెస్‌కు చందా గుడ్‌బై

7

- మానుకోట ఎంపీ టికెట్ ఇవ్వకపోవడమే కారణం
- ఇండిపెండెంట్‌గా పోటీచేస్తానని వెల్లడి



రేపటి నుంచి టెన్త్ పరీక్షలు

6

- ఖమ్మం జిల్లాలో 96 , భద్రాద్రిలో 73 పరీక్ష కేంద్రాలు..



ఎర్రజెండాలే కార్మికులకు అండ

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని

6

రైతు అభ్యున్నతికి కృషి చేయాలి



కార్మికులకు యూనిఫామ్‌లు అందజేస్తున్న తుమ్మల నాగేశ్వరావు

- ఆదర్శంగా ఖమ్మం వ్యవసాయమార్కెట్ అభివృద్ధి
- వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మం, మార్చి 16 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): దేశానికి అన్నం పెట్టే రైతుల అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. రైతు సంతోషంగా ఉంటేనే సమాజం సంతోషంగా ఉంటుందన్నారు. ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో శనివారం రూ.55లక్షలతో 2,760 మంది కార్మికులకు యూనిఫామ్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి తుమ్మల మాట్లాడుతూ ఖమ్మం వ్యవసాయమార్కెట్‌ను రాష్ట్రంలోనే మోడల్‌గా తీర్చిదిద్దేందుకు రూ.100కోట్లతో అధునాతన సౌకర్యాలతో నూతన మార్కెట్ సముదాయాన్ని నిర్మిస్తున్నట్లు తెలిపారు. దేవుడు మనిషిని సృష్టిస్తే రైతు అన్నం పెడుతున్నాడని, అలాంటి రైతు దేవుడి కంటే ఎక్కువని తుమ్మల పేర్కొన్నారు. అందువల్ల ప్రతి ఒక్కరు రైతుల పట్ల, రైతు సంక్షేమం పట్ల చిత్తశుద్ధితో పనిచేయాలని తెలిపారు. హమాలీ నుంచి ప్రధాని వరకు రైతు సంక్షేమం కోసమే పనిచేయాలని సూచించారు. రాజకీయ నాయకులు, అధికారులు, ఉద్యోగులు అందరూ రైతు శ్రేయస్సు కోసం, అతడి మనుగడ కోసం పనిచేయాలన్నారు. అన్నదాతను రక్షించుకోవడం అందరి బాధ్యత అన్నారు. రైతు చిరునవ్వుతో ఉంటేనే సమాజం సంతోషంగా ఉంటుందన్నారు. రైతులకు వ్యవసాయ మార్కెట్‌లో ఎలాంటి కష్టం, నష్టం కలగకూడదన్నారు. రైతులను ఎవరు మోసం చేయవద్దని కోరారు. తనకు ఎప్పుడు అవకాశం వచ్చినా ఖమ్మం పట్టణాన్ని, జిల్లాను అభివృద్ధిలో మోడల్‌గా ఉంచేలా పనిచేశానని పేర్కొన్నారు. కార్యక్రమంలో మార్కెట్ సెక్రటరి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, జిల్లా రైతు సమన్వయ సమితి మాజీ కన్వీనర్ నల్లమల వెంకటేశ్వరరావు, మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ మానుకొండ రాధాకిషోర్ తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ లక్ష్మీభాయి వ్యవసాయ మార్కెట్‌లో రైతులకు తాగునీటి ఫిల్టర్ ప్రారంభించారు.

వారిదంతా నాటకం..



కాంగ్రెస్ పాలనకు 100రోజులు పూర్తయిన సందర్భంగా కేక్ కట్‌చేస్తున్న మంత్రి పొంగులేటి

- అరెస్టుల పేరుతో బీజేపీ, బీఆర్ఎస్ డ్రామాలు
- లోక్‌సభ ఎన్నికల్లో ఆ పార్టీలకు బుద్ధి చెప్పాలి
- రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- కాంగ్రెస్ పాలనకు 100 రోజులు పూర్తయిన సందర్భంగా సంబరాలు

కూసుమంచి, మార్చి 16: లోక్‌సభ ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు డ్రామాలు ఆడుతున్నాయని రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి విమర్శించారు. రెండు పార్టీలు కూడబలుక్కొని "నేను కొట్టినట్లు చేస్తా.. నువ్వు ఏడ్చినట్లు నటించు" అన్నట్లు వ్యవహరిస్తున్నాయని ఎద్దేవా చేశారు. ఖమ్మం జిల్లా కూసుమంచి, జీళ్లచెరువు గ్రామాల్లో శనివారం పలు అభివృద్ధి పనులను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లిక్కర్ కుంభకోణం వ్యవహారంలో గత రెండేళ్లుగా కాలాయాపన చేస్తూ వచ్చిన బీజేపీ సరిగ్గా లోక్‌సభ ఎన్నికల నగారా మోగే సమయంలో అరెస్టు పేరుతో డ్రామా మొదలు పెట్టిందని ఆరోపించారు. సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ, బీఆర్ఎస్‌లకు ప్రజలు సరైన బుద్ధి చెప్పాలని కోరారు. ప్రజలందరి దీవెనలతో రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యం వచ్చిందన్నారు. పాలేరు ప్రజలు కోరుకున్నట్లుగానే తాను గృహనిర్మాణ శాఖ మంత్రినయ్యానని తెలిపారు. ఇటీవల సీఎం రేవంత్ చేతులమీదుగా ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో వైఎస్సార్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఇందిరమ్మ ఇళ్లు కట్టించారని గుర్తు చేశారు. గత ప్రభుత్వం మాత్రం ఒట్టి మాటలతో కాలాయాపన చేసిందని ఆరోపించారు. ఎన్నికల సందర్భంగా తాము ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేరుస్తామని తెలిపారు. త్వరలోనే అర్హులందరికీ రేషన్ కార్డులు మంజూరు చేస్తామన్నారు. తాము ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తామని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో ప్రజలు ఎన్నో నిర్బంధాలు ఎదుర్కొన్నారని, కానీ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రజలు స్వేచ్ఛావాయువులు పీల్చుకుంటున్నారన్నారు.

ఈ కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు రాయల నాగేశ్వరరావు, మద్దినేని స్వర్ణకుమారి, ఎంపీపీ బాణోతు శ్రీనివాస్, మద్ది శ్రీనివాసరెడ్డి, జొన్నలగడ్డ రవికుమార్, రామా శ్రీను, జూకూరి గోపాలరావు, హఫీజుద్దీన్, మాదాసు ఉపేందర్, బారి వీరబద్రం, అంజయ్య, మంకెన వాసు, సూర్యనారాయణరెడ్డి, యడవల్లి రాంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

3,97,227 కేసుల పరిష్కారం

విజయవంతమైన జాతీయ లోక్ అదాలత్

7

ప్రక్షాళన దిశగా ఏఆర్‌ఎస్‌కే

» ఉమ్మడి జిల్లాలో 41ఏఆర్‌ఎస్‌కే కేంద్రాలు » నాణ్యమైన సేవలందిస్తున్న ఏఆర్‌ఎస్‌కేలను కొనసాగించాలని రైతుల వినతి

వైరా, మార్చి 16: అన్నదాతలకు ఆసరాగా ఉంటున్న ఆగ్రోస్ రైతు సేవ కేంద్రాలను(ఏఆర్‌ఎస్‌కే) ప్రక్షాళన చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం పలు చర్యలు చేపట్టింది. ఉమ్మడి రాష్ట్రం నుంచి తెలంగాణ విడిపోయాక రాష్ట్రంలో పలు సాగునీటి వనరులు అందుబాటులోకి వచ్చి పంటల సాగు పెరిగింది. రైతుల వ్యవసాయ అవసరాలకనుగుణంగా అప్పటికే ఉన్న ప్రైవేట్ ఎరువులు, విత్తనాల డీలర్లు, సహకార సంఘాలు సక్రమంగా సరఫరా చేయకపోవడంతో అప్పటి ప్రభుత్వం వ్యవసాయశాఖ ద్వారా రాష్ట్రంలో ఆగ్రోస్ రైతు సేవ కేంద్రాలను ఏర్పాటు చేసింది. వాటి ద్వారా మార్క్‌ఫెడ్ నుంచి యూరియా, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ నుంచి విత్తనాలు, ఆయా కంపెనీల నుంచి కాంప్లెక్స్, రాయితీ ఎరువులను రైతులకు సరఫరా చేసేందుకు 2020లో ఈ ప్రక్రియ ఏర్పాటైంది. ప్రభుత్వం దాదాపు 800ఏఆర్‌ఎస్‌కేలను మంజూరు చేయగా సుమారు 600 కేంద్రాలు మాత్రమే రైతులకు సేవలందిస్తున్నాయి. వీటిలో 200కేంద్రాలకు చెందిన నిర్వాహకులు పెట్టుబడి, గోదాము వసతి తదితర కారణాలతో మధ్యలోనే మూసివేశారు. అయితే వ్యవసాయశాఖ అవసరమున్న చోట్ల కొన్ని కేంద్రాలకు మాత్రమే యూరియా కేటాయిస్తూ మిగతా వాటికి సరఫరా చేయడం లేదు.

ఏఆర్‌ఎస్‌కే నిర్వహణకు అర్హతలు...

ఏఆర్‌ఎస్‌కే కేంద్రాల ఏర్పాటుకు ఏజీబీఎస్సీ లేక వ్యవసాయశాఖ ద్వారా శిక్షణ పొంది, దేశీ సర్టిఫికెట్ కలిగి, నైపుణ్యం ఉన్నవారు ఏఆర్‌ఎస్‌కే దరఖాస్తు చేసుకోవాల్సి ఉంది. ఎరువులు, విత్తనాలను అందుబాటులో ఉంచేందుకు సొంతంగా ఆర్థిక స్థోమత కలిగి వారే అర్హులు. సొంత గోదాములు, ఇతర మౌలిక సదుపాయాలు కలిగి ఉండాలి. ఇలాంటి వారికే లైసెన్స్‌లు జారీ చేయాలని నిబంధనలు ఉన్నాయి. జనరల్ కేటగిరీ అభ్యర్థులైతే రూ.3.10లక్షలు, ఎస్సీ, ఇతర వెనుకబడిన తరగతులకు చెందిన అభ్యర్థులు రూ.1.60లక్షలు ప్రభుత్వానికి డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుంది. ప్రభుత్వం ఏఆర్‌ఎస్‌కే కేంద్రాలకు అరువుపై ఏవిధమైన ఎరువులు, విత్తనాలు సరఫరా చేయటం కానీ, ఆయా కంపెనీలకు హామీలివ్వడం కానీ ఉండదు. నిర్వాహకులే ముందస్తు చెల్లింపుల ద్వారా వాటిని తెచ్చుకోవాల్సి ఉంటుంది. ఈ నిబంధనలకు అంగీకరించిన ఖమ్మం జిల్లాలోని 41మంది, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని



వైరాలోని ఆగ్రోస్ రైతు సేవ కేంద్రం

21మందిని ఎంపిక చేసి ఏఆర్‌ఎస్‌కేలకు లైసెన్స్‌లు జారీ చేశారు. అయితే జిల్లాలో ఎరువులు, విత్తనాల సరఫరాలో అప్పటికే సమస్యాత్మకంగా ఉన్న వైరా, కొణిజర్ల, ముదిగొండ, కల్లూరు, ఏన్కూరు, ఖమ్మం గ్రామీణ ప్రాంతాల్లో కొత్తగా ఏఆర్‌ఎస్‌కే కేంద్రాల ఏర్పాటుకు అభ్యర్థులెవరూ ముందుకు రాకపోవడంతో అప్పటికే ప్రైవేట్ ఎరువుల దుకాణాలు ఉండి, అనుభవం, ఆర్థికస్థోమత, దేశీ సర్టిఫికెట్ ఉన్నవారిని గుర్తించి వారికే ఈ కేంద్రాలను మంజూరు చేయాలని నిర్ణయించి ఆయా మండలాల నుంచి 15 మందిని ఎంపిక చేశారు. ప్రతిపాదనలు పంపించి లైసెన్స్‌లు మంజూరు చేయించారు. దాంతో జిల్లాలో మొత్తం 41 కేంద్రాలు ఏర్పాటై రైతులకు సేవలందిస్తున్నాయి. అయితే ఇప్పుడు ఉన్నపళంగా సమర్థవంతంగా పనిచేస్తున్న ఏఆర్‌ఎస్‌కేలను కూడా ప్రక్షాళనతో చర్యలు తీసుకుంటే రైతులుకు అందుతున్న సేవలను కోల్పోయే అవకాశముంది. గతంలోని కొన్ని నిబంధనలను సడలించి రైతులకు నాణ్యమైన సేవలందిస్తున్న ఏఆర్‌ఎస్‌కేలను యథావిధిగా కొనసాగించాలని, ప్రభుత్వ ప్రక్షాళన ఆదిశగా కూడా ఉండాలని రైతులు కోరుతున్నారు.

ఏఆర్‌ఎస్‌కేల సమస్యలు పరిష్కరించాలని వ్యవసాయ శాఖ మంత్రికి వినతి...

దాంతో ఇటీవల కొత్త ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత రాష్ట్రంలోని కొందరు ఆగ్రోస్ డీలర్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కలిసి తమ సమస్యలను వివరించి పరిష్కరించాలని కోరారు. గత ప్రభుత్వం ఏఆర్‌ఎస్‌కే సెంటర్లు పెట్టుకున్న నిరుద్యోగులకు యూరియాతో పాటు విత్తనాలను ఎఫ్‌పీఎల్ ద్వారా సరఫరా చేస్తామని తెలిపి లక్షలాది రూపాయలు డిపాజిట్లు స్వీకరించిందని, అయితే కొన్ని కేంద్రాలకే ఎఫ్‌పీఎల్ ఇచ్చి మిగతా వాటికి మొండిచేయి చూపడంతో రైతులకు సక్రమంగా ఎరువులు సరఫరా చేయక ఇబ్బందులు పడుతున్న విషయాన్ని మంత్రి తుమ్మల దృష్టికి తీసుకువెళ్లారు. దాంతో గతంలో ప్రైవేట్ ఎరువుల దుకాణాలు నిర్వహిస్తూ ఆగ్రోస్ కేంద్రాలున్న వారితోపాటు ఇప్పటికే లైసెన్స్ పొంది మూసివేసిన వాటిపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని వ్యవసాయశాఖ అధికారులను ఆదేశించింది. ప్రైవేట్ ఎరువుల దుకాణాలు, ఆగ్రోస్ కేంద్రాలు విడిగా ఉన్నాయా...? మూసివేసిన ఏఆర్‌ఎస్‌కేలు ఎన్ని ఉన్నాయనే దానిపై విచారణ చేసి ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలని ఆదేశించింది. దీంతో ఇప్పటికే ఖమ్మం జిల్లాలోని రైతులకు ఏఆర్‌ఎస్‌కేల ద్వారా సేవలందిస్తున్న 15మంది నిర్వాహకులకు అధికారులు నోటీసులు జారీ చేశారు. ఈ దుకాణాలు ఎందుకు తొలగించకూడదో తెలియజేయాలని ఆనోటీసుల్లో పేర్కొన్నారు.

పకడ్బందీగా ఎన్నికల కోడ్ అమలు చేయాలి

» రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

ఖమ్మం కలెక్టరేట్, మార్చి 16: భారత ఎన్నికల సంఘం సాధారణ లోకసభ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన నేపథ్యంలో ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిందని, దీనిని పక్కాగా అమలు చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ అన్నారు. శనివారం హైదరాబాద్ నుండి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్, డిజిపి రవి గుప్తా, ఇతర రాష్ట్ర స్థాయి ఉన్నత స్థాయి అధికారులతో కలిసి లోకసభకు జరగబోయే సాధారణ ఎన్నికల ఏర్పాట్లపై జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్, పోలీస్ కమీషనర్ సునీల్‌దత్, అదనపు కలెక్టర్లు బి. సత్యప్రసాద్, డి. మధుసూదన్ నాయక్, నగరపాలక సంస్థ కమీషనర్ ఆదర్శ్ సురభి, శిక్షణా కలెక్టర్లు మయాంక్ సింగ్, యువరాజ్, ట్రెయినీ ఐపీఎస్ మౌనిక పాల్గొన్నారు.

ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ మాట్లాడుతూ, ఎన్నికల కమిషన్ షెడ్యూల్ విడుదల చేసిన నేపథ్యంలో తక్షణమే ఎన్నికల ప్రవర్తన నియమావళి (ఎన్నికల కోడ్) అమలులోకి వస్తుందని, 24 గంటల వ్యవధిలో ప్రతి ప్రభుత్వ భవనాలలో వివిధ రాజకీయ పార్టీలకు, నాయకులకు సంబంధించిన హోర్డింగులు, నాయకుల ఫోటోలు , వాల్ రైటింగ్స్ తొలగించాలని, 48 గంటల వ్యవధిలో పబ్లిక్ ప్రాపర్టీస్ వద్ద హోర్డింగులు, ఫ్లెక్సీలు ఫోటోలు తొలగించాలని, ప్రైవేట్ స్థలాల్లో ఉన్న హోర్డింగులు, ఫ్లెక్సీలు, ఫోటోలను 72 గంటల్లో తొలగించాలని ఆయన అధికారులకు ఆదేశించారు. రాష్ట్రంలో ఉన్న వివిధ ప్రభుత్వ శాఖల వెబ్ సైట్, జిల్లా వెబ్ సైట్ లలో మంత్రుల ఫోటోలు, ముఖ్యమంత్రి ఫోటో లను తొలగించాలన్నారు.

రాజకీయ పార్టీలు, వివిధ వర్గాలకు చెందిన ప్రజలకు ర్యాలీలు, సభల నిర్వహణకు అనుమతులు నిబంధనల ప్రకారం ఫస్ట్ కమ్ ఫస్ట్ సర్వ్ విధానంలో జారీ చేయాలని సూచించారు. ఎన్నికల విధులలో పాల్గొనే ప్రతి ఒక్కరికి తప్పనిసరిగా పోస్టల్ బ్యాలెట్ అందించే విధంగా వారి సమాచారాన్ని ముందస్తుగా సేకరించాలని, ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బంది వివరాలు పక్కాగా నమోదు చేయాలని అన్నారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్ల జారీలో ఎలాంటి ఇబ్బందులు జరగకుండా చూడాలని అన్నారు.

అక్రమ నగదు, మద్యం ఇతర ప్రలోభాలకు ఓటర్లు గురికాకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని, అన్నారు. ఆధారాలు లేకుండా 50 వేలకు మించి నగదు ఎవరు ఎన్నికల దృష్ట్యా తీసుకోని వెళ్లవద్దని అన్నారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని, సదరు జప్తుపై ఎక్కడ అప్పీల్ చేయాలో ఆ వివరాలు రశీదులో నమోదు చేయాలని అన్నారు.

రాజకీయ పార్టీలు, అభ్యర్థులకు సంబంధించిన ప్రకటనలకు అనుమతి వెంటనే అందించే విధంగా పని చేయాలని అన్నారు. శాంతి భద్రతలు కట్టుదిట్టంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. సామాజిక మాధ్యమాలలో ఎన్నికల యంత్రాంగంపై అపోహలు సృష్టించేలా వచ్చే ఫేక్ న్యూస్ లను ఎప్పటికప్పుడు ఫాలో అప్ చేసి ఖండించాలని అన్నారు. ఎన్నికల యంత్రాంగంపై నమ్మకం కోల్పోయే విధంగా అసత్య ప్రచారాలు చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన తెలిపారు.

వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్ మాట్లాడుతూ, నూతన కలెక్టరేట్లో ఎన్నికల నిర్వహణ కోసం కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని, అందులో అవసరమైన మేర సిబ్బంది, వసతులు కల్పించాలని అన్నారు. అధికారులు తమకు కేటాయించిన విధులు సమర్థవంతంగా నిర్వర్తించాలని అన్నారు. ఈ సమావేశంలో ఎన్డీసీ ఎం. రాజేశ్వరి, జెడ్పి సిఇఓ వినోద్, డిఆర్డీఓ సన్యాసయ్య, సిపిఓ శ్రీనివాస్, ఎన్నికల సూపరింటెండెంట్ రాంబాబు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలి

ఖమ్మం కలెక్టరేట్, మార్చి 16: ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ కమిటీలు ఏర్పాటు చేసి, కనీస మౌలిక వసతుల కల్పనకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ వీపీ గౌతమ్ ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అధికారులతో మహిళాశక్తి కార్యక్రమంపై జిల్లా కలెక్టర్ సమీక్షలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాల నిర్వహణ బాధ్యతలను స్వశక్తి మహిళా సంఘాలకు అప్పగిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ బి. సత్యప్రసాద్, డి. మధుసూదన్ నాయక్, జిల్లా విద్యా శాఖధికారి సోమశేఖర శర్మ, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సన్యాసయ్య, జిల్లా పరిషత్ సీఈవో వినోద్, పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీల్లో విద్యార్థి ప్రతిభ

బోనకల్, మార్చి 16: పాట్నాలో ఈ నెల 10 నుంచి 15వరకు జరిగిన 68వ జూనియర్ మిని మిక్స్‌డ్ డబుల్స్ బాల్ బ్యాడ్మింటన్ జాతీయస్థాయి పోటీల్లో బోనకల్ గురుకుల పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న రూప ప్రతిభను చాటింది. జాతీయస్థాయి పోటీల్లో రాష్ట్రం తరఫున మూడో స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా విద్యార్థినిని పాఠశాల ప్రిన్సిపాల్ పార్వతి, బాల్ బ్యాడ్మింటన్ అసోసియేట్ కార్యదర్శి బొంతు శ్రీనివాసరావు, కోచ్ అమరేసి లింగయ్యలు అభినందించారు.

వ్యక్తి మృతి: ఆసుపత్రిపై దాడి

ఖమ్మం క్రైం, మార్చి16: వైద్యుల నిర్లక్ష్యంతో వ్యక్తి మృతి చెందాడని మృతుడి బంధువులు ఆసుపత్రిపై దాడికి పాల్పడిన సంఘటన శనివారం ఖమ్మం నగరంలో జరిగింది. రఘునాథపాలెం మండలం ఈర్లపూడి గ్రామానికి చెందిన కంటెపూడి నరసింహారావు (47) వారం రోజుల క్రితం జ్వరంతో బాధపడుతూ నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం చేరాడు. చికిత్స అనంతరం రెండు రోజుల క్రితం కుటుంబ సభ్యులు ఆయనను ఇంటికి తీసుకెళ్లారు. జ్వరం తగ్గకపోవడంతో కుటుంబ సభ్యులు వైద్యుడిని సంప్రదించారు. సదరు డాక్టర్ మరో ఆసుపత్రి వద్దకు తీసుకురావాలని తాను అక్కడే ఉన్నానని తెలపడంతో అతడిని అక్కడికి తీసుకువచ్చారు. అనంతరం డాక్టర్‌కు ఫోన్ చేసినా స్పందించకపోవడంతో పరిస్థితి విషమించి ఆ వ్యక్తి మృతి చెందాడు. దీంతో మృతుడి బంధువులు మృతదేహాన్ని ఆసుపత్రి వద్దకు తీసుకువచ్చి ఆసుపత్రిపై దాడికి పాల్పడ్డారు. మృతుడి కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆసుపత్రిపై దాడి ఘటన ఖండిస్తూ డాక్టర్ల సంఘం ఆధ్వర్యంలో నగర ఏసీపీ రమణమూర్తికి వినతి పత్రం అందజేశారు. ఈ ఘటనపై డాక్టర్ కిషోర్‌బాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు టూటౌన్ పోలీస్‌స్టేషన్లో కేసు నమోదు చేశారు.

రామా.. కనవేమీ..

» సమీక్షలే తప్ప.. భక్తులకు సౌకర్యాలేవీ..

» శాఖల మధ్య లోపించిన సమన్వయం?

» రేపే శ్రీరామనవమి ఏర్పాట్లపై ముందస్తు సమీక్ష



చెట్ల కింద సేదతీరుతున్న భక్తులు(ఫైల్)

భద్రాచలం, మార్చి 16: భద్రాచలం సీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో ఏప్రిల్ 17న నిర్వహించే శ్రీరామనవమిని కోసం జిల్లా అధికార యంత్రాంగం సమీక్షకు సన్నద్ధమవుతోంది. సోమవారం ఈ సమీక్ష సమావేశాన్ని కలెక్టరు ప్రియాంక నిర్వహించనున్నారు. యేటా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించే ఈ ప్రక్రియ కేవలం సమీక్షలకే పరిమితమవుతున్నాయనే విమర్శలున్నాయి. గత ఏడాది మార్చి 30న శ్రీరామనవమిని పురస్కరించుకొని నిర్వహించిన శ్రీ సీతారామచంద్రస్వామి వారి కల్యాణంలో భక్తుల అవస్థలు అంత ఇంత కాదు.

పోలీసుల తీరుపై ఆక్షేపణలు...

నాడు పోలీసు అధికారులు వ్యవహరించిన తీరుపై భక్తుల నుంచి ఆక్షేపణలు వ్యక్తమయ్యాయి. చివరకు కల్యాణం తిలకించేందుకు వచ్చే వీవీఐపీలు, భక్తులకు అత్యవసర పరిస్థితుల్లో సేవలందించేందుకు అంబులెన్సును సైతం కల్యాణ మండప ప్రాంగణ సమీపంలోకి రానీయలేదు. అప్పటిఎమ్మెల్యే పొదెం వీరయ్య అధికార యంత్రాంగం తనకు ప్రొటోకాల్‌పాటించలేదంటూ ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణంలో ఇష్టం వచ్చిన రీతిలో బారికేడ్లను ఏర్పాటు చేయడంతో భక్తుల అవస్థలు అంత ఇంత కాదు. ఆస్థాన హరిదాసులు స్వామి వారి కీర్తనలను ఆలపించేందుకు ఆరంభంలో మండపంలోకి రావాల్సి ఉన్నా ఆయన్ను అనుమతించలేదు. పల్లకి బోయల విషయంలోనూ ఒక సీఐ వ్యవహరించిన తీరుతో వారు కలత చెందారు.

సమన్వయ లోపం.

శ్రీరామనవమి లాంటి ప్రధాన ఉత్సవాలు నిర్వహిస్తున్న సమయంలో శాఖల మధ్య సమన్వయ లోపాన్ని సరిదిద్దుకోవాల్సి ఉంది. తానీషా సంప్రదాయంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం అందజేసే ముత్యాల తలంబ్రాలు, పట్టువస్త్రాల లాంచనాల మొత్తాన్ని పెంచుతామని దేవాదాయ శాఖ అనిల్‌కుమార్ చెప్పి రెండేళ్ల గడిచినా లాంచనాలకు రూ.లక్ష పెంపు అమలుకు నోచుకోలేదు.

భక్తులకు నిలువ నీడ కరువే

భద్రాద్రిలో భక్తులు సేద తీరేందుకు సదుపాయాలు లేవు. వసతి గదులు అందరికీ అందుబాటులోకి రావడం సాధ్యంకాదు. భక్తులకు బ్రహ్మోత్సవాల రోజుల్లో చల్లటి నీళ్లు, మజ్జిగ ఎక్కడికక్కడ అందించేలా అధికార యంత్రాంగం చర్యలు తీసుకోవాలి. షామియానాలు భక్తుల అవసరాలకు తగినట్లుగా ఏర్పాటు చేయాలి. భక్తులకు స్వామి వారి కల్యాణంను తిలకించే అవకాశం, మూలవరుల దర్శన భాగ్యం, కనీస సదుపాయాలు కల్పించాలి. నవమి కల్యాణం అనంతరం రామయ్య ముత్యాల కల్యాణ తలంబ్రాలు సామాన్య భక్తులకు సైతం అందుబాటులో ఉండేలా మరిన్ని కౌంటర్లు పెంచాలి

ఎన్నికల కోడ్ నేపథ్యంలో సీఎం వచ్చేనా?

లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో శనివారం ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన నోటిఫికేషన్‌ను కేంద్ర ఎన్నికల సంఘం జారీ చేసింది. దీంతో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. ఈ క్రమంలో ఏప్రిల్ 17న శ్రీరామనవమిని పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం తరఫున ముత్యాల తలంబ్రాలు పట్టు వస్త్రాలతో సీఎం రేవంత్‌రెడ్డి దంపతులు వస్తారా రారా అనే దానిపై స్పష్టత రావడం లేదు.

ప్రతి హామీని నిలబెట్టుకుంటాం: మంత్రి పొంగులేటి



చెర్వుమాధారంలో జరిగిన సభలో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి

నేలకొండపల్లి, మార్చి 16: చెప్పిన ప్రతి మాట...ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకుని తీరతామని పాలేరు శాసనసభ్యుడు, రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. మండల పరిధిలోని చెన్నారం, చెర్వుమాధారం గ్రామాల్లో శనివారం పలు అభివృద్ధి కార్యక్రమాల్లో మంత్రి పొంగులేటి పాల్గొన్నారు. చెన్నారంలో రూ.20కోట్ల వ్యయంతో నిర్మించనున్న బీటీ రోడ్లకు, చెర్వుమాధారంలో రూ.16లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్లకు మంత్రి శంకుస్థాపన చేశారు.

అనంతరం జరిగిన సభల్లో మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన 100రోజుల్లోనే ఐదు గ్యారంటీలను అమలు చేసి చూపించామన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్ రూంలను ఇళ్ల ఇచ్చామని గొప్పలు చెప్పుకున్నదని, వాస్తవంలో పేదలకు ఇళ్ల కట్టించి ఇచ్చిన ఘనత ఇందిరమ్మ రాజ్యందేనన్నారు. రాష్ట్రంలో ఇందిరమ్మ ప్రభుత్వం ఏర్పడగానే 48గంటల్లోనే రెండు హామీలను అమలు చేశామన్నారు. మిగిలిన నాలుగు హామీల్లో మూడింటిని అమలు చేశామని, మిగిలిన ఒక్క హామీని ఎన్నికలయ్యాక అమలు చేస్తామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా అభివృద్ధిపై దృష్టి సారించిందన్నారు. పాలేరు నియోజకవర్గంలో మట్టి రోడ్డు కనపడకుండా చేస్తానని, పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తానని మంత్రి భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ వజ్జా రమ్య, నాయకులు శాఖమూరి రమేష్, వెన్నపూసల సీతారాములు, వేగినాటి లక్ష్మీనర్సయ్య, చాగంటి నారాయణ, షేక్.మస్తాన్, న్యాయవాది ఆకుల శేఖర్, కనమర్లపూడి రామకృష్ణ, తలశీల గోపాలరావు తదితరులున్నారు.

రేపటి నుంచి టెన్త్ పరీక్షలు

ఖమ్మం ఖానాపురంహవేలి/కొత్తగూడెం కలెక్టరేట్, మార్చి 16: పదో తరగతి వార్షిక పరీక్షలు 18వ తేదీన ప్రారంభం కానున్నాయి. ఇందుకోసం ఉమ్మడి జిల్లాలోని విద్యాశాఖ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు. రేపటినుంచి ఏప్రిల్ 1 వరకు ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:45వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. ఖమ్మం జిల్లాలో మొత్తం 16,577మంది విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరుకానుండగా వారిలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు 10,148 మంది, ప్రవేటు పాఠశాలల విద్యార్థులు 6429 మంది ఉన్నారు. వీరు కాకుండా ప్రైవేటుగా(ఒకసారి పరీక్ష తప్పిన వారు) 279మంది ఈ పరీక్షలకు హాజరుకానున్నారు. జిల్లా వ్యాప్తంగా 96 పరీక్షా కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తున్నట్లు డీఈవో సోమశేఖర శర్మ తెలిపారు.

పరీక్ష ప్రారంభమైన తరువాత 5 నిమిషాల వరకు విద్యార్థులను పరీక్షకు అనుమతించాలని ప్రభుత్వం ఆదేశించిందని తెలిపారు. కానీ విద్యార్థులు గంట ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. విద్యార్థులు పరీక్షల ప్రారంభానికి ముందు రోజే పరీక్షా కేంద్రాలను చూసుకోవాలని, తప్పనిసరిగా హాల్‌టికెట్లును తీసుకొని పరీక్షకు హాజరుకావాలని తెలిపారు. పరీక్ష కేంద్రాల్లోకి ఎలాంటి ఎలక్ట్రానిక్ వస్తువులను అనుమంతించబోమన్నారు. జిరాక్స్ సెంటర్లు మూసి ఉంచాలన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. అవసరమైన మందులతో వైద్య బృందాలను ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థులు సకాలంలో పరీక్షలకు హాజరయ్యేందుకు ఉదయం ఆర్టీసీ బస్సులు సిద్ధంగా ఉంటాయని తెలిపారు.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పదో తరగతి పరీక్షలకు 12,341మంది విద్యార్థులు హాజరుకానున్నారు. వీరి కోసం మొత్తం 73 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు డీఈవో వెంకటేశ్వరాచారి తెలిపారు. జిల్లాలో మొత్తం 303 పాఠశాలల నుంచి 12,341 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారన్నారు. వారిలో 5,900 మంది బాలురు, 6,441 మంది బాలికలు ఉన్నారు. 667మంది ప్రైవేటు విద్యార్థులు పరీక్షలు రాస్తున్నట్లు తెలిపారు. మొత్తం 73 పరీక్షా కేంద్రాలుంటే వాటిలో 70 రెగ్యులర్ పరీక్షా కేంద్రాలు, 3 ప్రైవేటు వేటు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. పరీక్షలకు ఎలాంటి ఇబ్బంది కలిగినా వెంటనే జిల్లా విద్యాశాఖ ఏసీజీఈ మాధవరావు 8919279238, జిల్లా కంట్రోల్‌రూం నెం 9396654181కు సమాచారం అందించాలని డీఈవో సూచించారు.

ఎర్రజెండాలే కార్మికులకు అండ: కూనంనేని



మాట్లాడుతున్న కూనంనేని సాంబశివరావు

ఖమ్మం ఖానాపురం హవేలి మార్చి 16: కార్మికుల పక్షాన పోరాడేది కేవలం ఎర్రజెండాలే అని, హక్కులు, సంక్షేమ పథకాల కోసం పోరాడక తప్పదని కొత్తగూడెం శాసన సభ్యుడు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ మూడవ రాష్ట్ర మహాసభలు నగరంలోని టిఎన్జీవోస్ ఫంక్షన్ హాల్‌లో శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మహాసభల ప్రారంభం సందర్భంగా ఎంప్లాయీస్ యూనియన్ పతాకాన్ని సీనియర్ నాయకుడు పద్మాకర్ ఆవిష్కరించారు. అమరుల స్థూపాన్ని తిమ్మినేని రామారావు ఆవిష్కరించారు. టీఎస్ ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్. బాబు అధ్యక్షతన ప్రారంభమైన మహాసభలో సాంబశివరావు మాట్లాడుతూ 1956లో ఆర్టీసీలో ఉద్భవించిన మొట్టమొదటి సంఘం ఎంప్లాయీస్ యూనియన్ ఆర్టీసీ కార్మికులకు అనేక హక్కులను సాధించిపెట్టిందన్నారు. సంఘాన్ని చీల్చేందుకు అనేక మార్లు ప్రయత్నం జరిగినా ద్రోహులకు బుద్ధి చెబుతూ కార్మికులు ఏఐటీయుసి అనుబంధ ఎంప్లాయీస్ యూనియన్ పక్షనే నిలిచారని గుర్తు చేశారు.

బీఆర్ఎస్, బీజేపీ రెండు కార్మిక వ్యతిరేక పార్టీలేనని కాంగ్రెస్ కూడా తన వైఖరిని మార్చుకుంటే మంచిదన్నారు. మూడు నెలల్లో 22 కోట్ల మంది మహిళలను గమ్యాలకు చేర్చిన ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలన్నారు. ఫిట్మెంట్ పెంచాలని, పెండింగ్లో ఉన్న డిఏలను వెంటనే విడుదల చేయాలని కూనంనేని డిమాండ్ చేశారు. ఆర్టీసీ కార్మికులుగా ఇదే చివరి మహాసభ కావచ్చునని భవిష్యత్తులో ప్రభుత్వ ఉద్యోగులుగా ఉండే అవకాశం ఉందని ఎక్కడ ఉన్నా వామపక్ష భావజాలాన్ని నిలుపుకుని ముందుకు సాగాలన్నారు. కవిత అరెస్టు రాజకీయ ఎత్తుగడగా ఆయన అభివర్ణించారు. తెలంగాణలో లబ్ది పొందేందుకు బిజెపి, బిఆర్ఎస్ ఒకటి కాదని చెప్పేందుకు కవితను అరెస్టు చేశారు తప్ప దీనిపై చిత్తశుద్ధి లేదన్నారు.

ఈ సభలో సీపీఐ జాతీయ-సమితి సభ్యులు భాగం హేమంతరావు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు విఎస్ బోస్, ఇ.వెంకన్న, ఖమ్మం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శులు పోటు ప్రసాద్, సాబీర్పాషా, ఎంప్లాయీస్ యూనియన్ సీనియర్ నాయకులు పద్మాకర్, గౌరవాధ్యక్షుడు వెంకట్ గౌడ్, నర్సింహన్, రామాంజనేయులు, దామోదర్, నర్సయ్య పాల్గొన్నారు.

మనస్తాపంతో యువకుడు ఆత్మహత్య

అశ్వాపురం మార్చి 16: మనస్తాపంతో ఓ యువకుడు మృతి చెందిన సంఘటన మండల కేంద్రమైన అశ్వాపురం ఎస్సీ కాలనీలో శుక్రవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..ఎస్సీ కాలనీకి చెందిన అయిలపొంగు జగదీష్(19)ప్రేమ విఫలమై ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు సీఐ అశోక్‌రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. జగదీష్ మృతదేహన్ని ఎంపీపీ ముత్తినేని సుజాత సందర్శించి నివాళులర్పించారు.

అధికారుల తనిఖీలు

ఖమ్మంకార్పొరేషన్, మార్చి16: నగరంలోని వైఎస్సార్‌కాలనీ సమీపంలోని ప్రభుత్వభూమి సర్వేనెంబర్ 37లో శనివారం రెవెన్యూ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ ప్రభుత్వ భూమని గతంలో మాజీ సైనికులకు కేటాయించారు. అయితే సదరు స్థలంలో చాలా వరకు షెడ్లు, బేస్‌మెంట్లు నిర్మించారు. దీంతో అసలు ఎవరు ఉంటున్నారు. మాజీ సైనికులు ఇళ్ల నిర్మించుకున్నారా? అనే విషయాలను అధికారులు పరిశీలించారు. లబ్ధిదారులు, వారి సంబంధీకులు పూర్తి వివరాలు విచారణ అధికారులకు అందచేయాలని అర్బన్ తహసీల్దార్ స్వామి ఒక ప్రకటనలో తెలిపారు.

మట్టి వాహనాల పట్టివేత

దుమ్ముగూడెం, మార్చి 16: మండల పరిధిలోని నడికుడి వద్ద అక్రమంగా మట్టిని తరలిస్తున్న రెండు వాహనాలను రెవెన్యూ సిబ్బంది శనివారం పట్టుకున్నారు. బ్లెడ్ ట్రాక్టర్, ట్రాక్టర్లను రెవెన్యూ కార్యాలయానికి తరలించారు. దాడుల్లో తహసీల్దార్ చంద్రశేఖర్, రెవెన్యూ సిబ్బంది జయబాబు, యాదగిరి, గోపి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



పోలీసులు స్వాధీనం చేస్తుకున్న వాహనాలు

నిండా ముంచిన నకిలీ విత్తనాలు

» పంట కాలం రాక ముందే పొట్టకొచ్చిన వరి పొలాలు » కొమరారంలో లబోదిబోమంటున్న రైతులు

ఇల్లెందు రూరల్, మార్చి 16: నకిలీ విత్తనాలు రైతులను నట్టేట ముంచుతున్నాయి. ఇల్లెందు మండలం కొమరారం ఉమ్మడి గ్రామపంచాయతీ పరిధిలో వందలాది ఎకరాలలో నకిలీ విత్తనాల మూలంగా రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితులు నెలకొన్నాయి. స్థానికంగా ఉన్న విత్తన కంపెనీల డీలర్లు యాసంగి పంటకు నకిలీ వరి విత్తనాలను అంట గట్టారని రైతులు ఆరోపిస్తున్నారు. పంటకాలం రాక ముందే పొట్ట దశకు రావడంతో రైతులు లబోదిబో మంటున్నారు.

కొమరారం గ్రామంలో సుమారు వంద ఎకరాలకు పైగా యాసంగి పంటగా వరి వేశారు. అయితే నకిలీ విత్తనాల మూలంగా 90నుంచి 110 రోజులలో రావల్సిన వరి పంట 40 నుంచి 45 రోజులలోనే వరి కంకులు వేసింది. నాటు వేసిన 50రోజులకు పొట్టపోసుకోవాల్సిన పొలాలు నాటు వేసిన 15రోజులలోనే వరి కంకులు వేయడంతో దిగాలు చెందుతున్నారు. పొలంలో వరి దుబ్బులు కట్టక ముందే కంకులు వేస్తుండంతో పంట చేతికి వచ్చే పరిస్థితి కనపడడంలేదని వాపోతున్నారు.

వరి విత్తన డీలర్లు నకిలీ విత్తనాలతో తమను మోసం చేశారని ఆరోపిస్తున్నారు. కొమరారం గ్రామంలోని అజ్మీరా రవి, రమేష్, గుగులోత్ భద్రు,



కంకులు వేసిన పొలాన్ని చూపెడుతున్న రైతులు

లక్ష్మణ్, శ్రీను ధారవత్ శ్రీను, సీతరాం, బాస్కర్, బానోత్ బాలు, ఇర్పా నాగేశ్వరావు, బాదవత్ హన్మంతరావు, మూడు శ్రీను, ధారవత్ రమేష్, కుర్సం వీరయ్య ఇస్లావత్ కోటేష్,మున్నెమ్మ, తేజవత్ శంకర్, భూక్య పాష, మూడు మాలు, దోంతు నారాయణ, వీరులతో పాటు అనేక మంది రైతులు నకిలీ విత్తనాల బారిన పడి తీవ్రంగా నష్టపోయారు.

అదే విధంగా పోచారం, అమర్‌సింగ్‌తండా, తుంటబాలు తండా, పోలారం గ్రామంలో వరి సాగు చేసిన రైతుల పరిస్థితి ఇలానే ఉంది. గ్రామంలో ఉన్న విత్తనాల డీలర్లతో పాటు ఇల్లెందు, మహబుబాబాద్ పట్టణంలో ఐదుగురు డీలర్ల వద్దవరి విత్తనాలు తీసుకొచ్చామని, పంట పరిస్థితిపై వివరించినప్పటికీ వారు తమను దుర్భాషలాడుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. తమకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని రైతులు వివరించారు.

ప్రభుత్వం ఆదుకోవాలి

మూడు శ్రీను,రైతు, కొమరారం

నకిలీ విత్తనాలు మమ్మల్ని తీవ్రంగా నష్టాల పాలు చేశాయి. ఎకరానికి రూ.30వేలకు పైగా పెట్టుబడి పెట్టాం. పెట్టుబడి వచ్చే పరిస్థితి లేదు. ప్రభుత్వం ఆదుకోవాలి. నకిలీ విత్తనాలు అమ్మిన డీలర్లను, విత్తన కంపెనీలపై చర్యలు తీసుకోవాలి.

చర్యలు తీసుకుంటాం

సతీష్, వ్యవసాయశాఖ అధికారి, ఇల్లెందు

కొమరారం గ్రామంలో 90 నుంచి 120 రోజులలో రావాల్సిన పంట 45రోజులలోనే వరి కంకులు వేస్తుండడం చూశాం. ఈ విషయాన్ని వ్యవసాయ శాస్త్రవేత్తల దృష్టికి తీసుకెళ్లాం. నకిలీ విత్తనాల మూలంగా ఇలా జరిగితే బాధ్యులపై చర్యలు తీసుకుంటాం.

పురుగుల మందు తాగి వ్యక్తి మృతి

దమ్మపేట, మార్చి 16: పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ ఓ వృద్ధుడు శనివారం ఖమ్మంలో మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అల్లిపల్లి గ్రామానికి చెందిన నందింగం వెంకటేశ్వరరావు (72) మద్యానికి బానిసయ్యాడు. ఈక్రమంలో తనకు మద్యం తాగేందుకు డబ్బులు కావాలని భార్యను అడగగా, ఆమె నిరాకరించటంతో మద్యం మత్తులో శుక్రవారం పురుగుల మందు తాగాడు. ఇది గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఖమ్మంలోని ఆస్పత్రికి తరలించారు. అతడికి వైద్య సిబ్బంది చికిత్స నిర్వహిస్తుండగా మృతి చెందాడు. కుమారుడు నందిగం ప్రసాద్ ఫిర్యాదు మేరకు ఎస్ఐ సాయి కిషోర్ రెడ్డి కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

పెద్దసారు పట్టుకున్నారు..చిన్నసారు విడిపించారు

● వివాదస్పదంగా మట్టి అక్రమ రవాణా వ్యవహారం

దుమ్ముగూడెం మార్చి 16: పెద్దసారు ఆదేశాలతో మట్టి అక్రమ రవాణా వాహనాలను పట్టుకున్న రెవెన్యూ సిబ్బంది చిన్నసారు హుంకరింపుతో వదలాల్సి వచ్చింది. రామచంద్రాపురంలో ఈనెల 15 రాత్రి సమయంలో మట్టి అక్రమరవాణాకు పాల్పడిన ఒక ఎక్స్‌కవేటర్, రెండు ట్రాక్టర్లను రెవెన్యూశాఖలోని పెద్దసారు ఆదేశాలతో రెవెన్యూ సిబ్బంది పట్టుకున్నారు. కార్యాలయానికి తరలించే క్రమంలో విషయం తెలిసిన కార్యాలయంలోని ఓ చిన్నసారు వాహనాలను వదలాల్సిందేనని సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేయడంతో వాటిని వదిలేశారు. వాహనాలను వదలకపోతే కార్యాలయంలో జరుగుతున్న అక్రమాలను బైటపెడతానని హెచ్చరించినట్లు సమాచారం. ఐతే సగం దూరం తీసుకొచ్చిన వాహనాలను వదిలేయడం మండల వ్యాప్తంగా చర్చకు తెరలేసింది. రెవెన్యూ కార్యాలయంలో కొద్దిరోజులుగా పెద్దసారు, చిన్నసార్ల మధ్య కొన్ని వ్యవహారాల్లో మనస్పర్థలు తలెత్తాయని తెలుస్తోంది. వదిలేసిన వాహనాలను రెవెన్యూ కార్యాలయం వద్ద తెచ్చి పెట్టాలని పెద్దసారు శనివారం ఆదేశించినట్లు సమాచారం. ఈ విషయంపై వివరణ కోరుతూ చిన్నసారుకు నోటీసును కూడా తయారు చేసినట్లు సమాచారం. ఈ విషయమై తహసీల్దార్ చంద్రశేఖర్‌ను వివరణ కోరగా, వాహనాలను పట్టుకునేందుకు వెళ్లిన రెవెన్యూ సిబ్బంది వాంగ్మూలం మేరకు వాహనాలను వదిలేయాలని బలవంతం చేసిన గిర్దావరు వివరణ కోరేందుకు నోటీసు తయారు చేసినట్లు తెలిపారు. ఈ విషయమై ఆర్డీఓతో చర్చించి అవసరమైతే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

మహిళా పోలీస్ స్టేషన్ సీఐగా బాధ్యతలు చేపట్టిన వేణు

ఖమ్మం క్రైం, మార్చి 16: మహిళా పోలీస్‌స్టేషన్ సీఐగా జి.వేణు శనివారం రాత్రి బాధ్యతలు చేపట్టారు. ఇటీవల బదిలీల్లో భాగంగా ఇక్కడ పనిచేస్తున్న సీఐ వెంకటరత్నం ను సికింద్రాబాద్ జీఆర్పీ కు బదిలీ కాగా ఆయన స్థానంలో వరంగల్ నుండి జి.వేణు నియమితులయ్యారు.ఈ నేపథ్యంలో శనివారం రాత్రి ఆయన బాధ్యతలు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

కొణిజర్ల, మార్చి16: మండల పరిధిలోని మల్లుపల్లికి చెందిన ఆలకుంట ఉపేందర్(20) ద్విచక్ర వాహనంపై మల్లుపల్లి నుంచి కొణిజర్ల వైపు వెళ్తుండగా కొణిజర్ల నుంచి మల్లుపల్లికి వస్తున్న ఆటో ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఉపేందర్ తీవ్రంగా గాయపడగా, కొణిజర్లలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అతడిని పరీక్షించిన వైద్యులు పరిశీలించి అప్పటికే మృతి చెందిన్నట్లు తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



ఉపేందర్ మృతదేహం

జాడలేని వడ్డీ రాయితీ

● పంట రుణాలపై గత ప్రభుత్వం ఇవ్వని రాయితీ

● కొత్త ప్రభుత్వం పైనే ఆశలు



సత్తుపల్లి, మార్చి 16: రైతులు బ్యాంకుల నుంచి తీసుకున్న పంట రుణాలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాల్సిన 4శాతం వడ్డీరాయితీ సొమ్ము జాడలేకుండా పోయింది. గత ప్రభుత్వంలో తొమ్మిదేళ్లపాటు రైతుల పంట రుణాలను సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం వడ్డీ రాయితీ ఇవ్వలేదు. గతంలో విపక్షాలు, రైతు సంఘాలు ఎన్ని విన్నపాలు చేసినా బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టించుకోలేదు. సాధారణంగా పంట రుణాలపై బ్యాంకులు 7 శాతం వడ్డీ వసూలు చేస్తున్నాయి. రూ.3లక్షల లోపు పంట రుణంపై 7శాతం వడ్డీ వర్తిస్తుంది. రూ.లక్ష వరకు పంట రుణంపై 7శాతం వడ్డీలో 3శాతం కేంద్ర ప్రభుత్వం వడ్డీ రాయి తీ ఇస్తుంది. 2014వరకు అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభు త్వం రాష్ట్ర ప్రభుత్వం వాటాగా 4శాతం వడ్డీ రాయితీ ఇస్తూ వచ్చింది. అంటే రూ.లక్ష వరకు వడ్డీలేని పంట రుణం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో రైతులు తీసుకున్నారు. కానీ 2014లో బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత రైతు బంధు పథకం ప్రవేశపెట్టి 2015-16నుంచి రాష్ట్రప్రభుత్వం ఇవ్వాల్సిన 4శాతం వడ్డీ రాయితీని బ్యాంకులకు జమచేయడం లేదు. అప్పటి నుంచి ఇప్పటివరకు కేంద్ర ప్రభుత్వం 3శాతం వడ్డీ రాయితీ ఇస్తూ వస్తుంది. ప్రభుత్వం ఇవ్వాల్సిన వడ్డీ రాయితీని రద్దు చేస్తున్నట్లు అప్పట్లో ప్రభుత్వం ప్రకటించపోయినా రాయితీని నిలుపుదల చేసింది.

ఈ క్రమంలో సొసైటీల్లో రైతులు తీసుకున్న రుణాలకు సం బంధించి రాష్ట్ర ప్రభుత్వం వడ్డీ రాయితీ ఇస్తుందని వడ్డీ చెల్లించలేదు. దీంతో ఐయిదారేళ్ల పాటు రైతులు 4శాతం వడ్డీ చెల్లించకపోవడంతో ఐదేళ్ల పేరుకు పోయిన వడ్డీ బకాయిలను అసలుకు కలిపి సొసైటీలలో రుణం ఖాతాలో జమచేశారు. దీంతో రైతుల రుణం పెరిగి పోయింది. 2020తర్వాత రైతుల నుంచి సహకార సం ఘాలలో 4శాతం వడ్డీని కూడా కలిపి వసూలు చేస్తున్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో 2014వరకు వడ్డీ రాయితీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇవ్వడంతో ప్రస్తుతం కాంగ్రెస్ అధికారంలో ఉండటంతో రైతులలో ఆశలు చిగురిస్తున్నాయి. రూ.లక్ష లోపు పంట రుణం వరకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చే 3శాతం వడ్డీ రాయితీతో పాటు రాష్ట్రప్రభు త్వం 4శాతం వడ్డీ రాయితీ కూడా పునరుద్ధరించాలని రైతులు కోరుతున్నారు.

వైరా కాల్వలకు మహర్దశ



అధ్వానంగా ఉన్న ఎడమకాల్వ

- రూ.42.10కోట్లు మంజూరు చేసిన ఉప ముఖ్యమంత్రి
- తొలి నుంచి కాల్వల ఆధునికీకరణపై భట్టి ప్రత్యేక చొరవ

వైరా, మార్చి 16: వైరా రిజర్వాయర్ కుడి, ఎడమ కాల్వల ఆధునికీకరణ కోసం రూ.42.10కోట్ల నిధులు మంజూరయ్యాయి. డిప్యూటీ సీఎం, ఆర్థికశాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రత్యేక చొరవ, వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ వినతితో ఈ నిధులను కేటాయించారు. ఆమేరకు ఈనెల 15వతేదీన జీవోఆర్టీ నెంబర్ 59ను ప్రభుత్వ సెక్రటరీ రాహుల్ బొజ్జా విడుదల చేశారు. రూ.86.80కోట్ల నిధులకు నీటిపారుదలశాఖ అధికారులు ప్రతిపాదనలు పంపించగా రెండో పేజ్‌లో రూ.42.10కోట్లు మంజూరయ్యాయి. ఇంకా రూ.45కోట్ల నిధులు అవసరముంది. గతంలోనూ ఇప్పుడు ఈ కాల్వల ఆధునికీకరణకు భట్టి విక్రమార్క ప్రత్యేక చొరవతోనే నిధులు రావడం విశే షం. డిప్యూటీ సీఎంగా భట్టి విక్రమార్క బాధ్యతలు చేపట్టిన తర్వాత వైరా మండలంలోని తమ స్వగ్రామమైన స్నానాల లక్ష్మీపురం గ్రామానికి రావడానికి ముందు వైరా కాల్వల ఆధునీకరణ చేయడానికి అవసరమైన నిధుల కొర త విషయమై 'ఆంధ్రజ్యోతి' ఒక ప్రత్యేక కథనాన్ని ప్రచురించింది. వెంటనే ఆకథనం భట్టి విక్రమార్క దృష్టికి వెళ్లిం ది. అయితే కాల్వల ఆధునీకరణకు నిధులు మం జూరు విషయమై భట్టి విక్రమార్క ప్రత్యేక దృష్టిసారించారు.

స్నానాల లక్ష్మీపురం వచ్చిన రోజే కుడి, ఎడమకాల్వల ఆధునీకరణ పనుల కోసం అవసరమైన ప్రతిపాదనలు పంపించాలని నీటిపారుదలశాఖ అధికారులను భట్టి విక్రమార్క ఆదేశించారు. ఈ ప్రతిపాదనల విషయమై గతనెల ఏడోతేదీన రెండోసారి స్నానాల లక్ష్మీపురం వచ్చిన భట్టి విక్రమార్క ఈ ప్రతిపాదనలపై నీటిపారుదలశాఖ అధికారులతో సమీక్షించారు.

నాడు భట్టి చొరవతో రూ.65కోట్లతో ఆధునికీకరణ

2007-08 ప్రాంతంలో రూ.65కోట్ల జపాన్ బ్యాంకు నిధులతో ఇంతకముందు ఈ రెండు కాల్వల ఆధునికీకరణ పనులను భట్టి విక్రమార్క చొరవతోనే పూర్తిచేశారు. అప్పుడు ఎలాంటి అధికారిక పదవి లేక పోయినప్పటికీ వైరా ప్రాంతానికి చెందిన భట్టి విక్రమార్క అప్పుడే ఈ రెండు కాల్వలను అనేకసార్లు సర్వే చేయించారు. నాటి కాంగ్రెస్ ప్రభుత్వంలోని డిప్యూటీ సీఎం కోనేరు రంగారావు సహకారంతో జైకా(జపాన్ ఇంటర్నేషనల్ కార్పొరేషన్ ఏజెన్సీ) నుంచి రూ.50కోట్ల పైచిలుకు నిధులను మంజూరు చేయించారు. ఆనిధులు సరిపోకపోవడంతో అదనంగా మరో రూ.15కోట్ల నిధులు మంజూ రు చేయించారు. 2009 జనవరి మొదటివారంలో నాటి ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్‌రెడ్డి మధిరలో వర్చువల్‌గా ఈ పనులను ప్రారంభించారు. ఆనిధులతో కుడి కాల్వ 24కిలోమీటర్లు పొడవు ఉండగా గతంలో 7.8కిలోమీటర్లు ఆధునీకరణ జరిగింది. ఇంకా మిగిలిన కాల్వ అధ్వానంగా ఉంది. అయితే 20.5వ కిలోమీటర్ వరకు ఈ కాల్వల సిమెంట్ గోడల నిర్మాణాని కి ప్రతిపాదనలు పంపించారు. అలాగే ఎడమకాల్వ 15 కిలోమీటర్ల పొడవు ఉండగా గతంలో 9.5కిలోమీటర్ వర కు ఆధునీకరణ జరిగింది. కొత్త ఆక్విడెక్‌లు నిర్మించారు. వైరా రిజర్వాయర్ వరదనీటి ముంపు నుంచి కాపాడేందుకు నూతనంగా ఐదో అలుగును నిర్మించారు. పది కిలోమీటర్ల మెటల్ రోడ్లు నిర్మించారు.

> రైతులు, కాంగ్రెస్ నాయకుల హర్షం.... గతంలోనూ ఇప్పుడు భట్టి విక్రమార్క చొరవతోనే దాదాపు రూ.115కోట్లు నిధులు వైరా కుడి, ఎడమ కాల్వల ఆధునికీకరణకు మంజూరు కావడం పట్ల ఆయకట్టు రైతులు, కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నిధుల మంజూరుకు చొరవ తీసుకున్న భట్టి విక్రమార్క, నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే రాందాస్‌నాయక్‌కు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శీలం వెంకటనర్సిరెడ్డి సహా పలువురు నాయకులు, ఆయకట్టు రైతులు కృతజ్ఞతలు తెలిపారు.

మళ్లీ ఆయన చొరవతో నిధుల మంజూరు...

గత పదేళ్ల కాలంలో వైరా కాల్వల అభివృద్ధికి పైసా నిధులు కూడా మంజూరు కాలేదు. ఉమ్మడి ఏపీలో జరిగిన ఆధునీకరణ పనులు మినహా ప్రత్యేక రాష్ట్రంలో ఈ కాల్వల్లో ఒక్క పని కూడా జరుగలేదు. ఇప్పుడు మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వం రావడంతోనే వైరాకు చెందిన భట్టి విక్రమార్క ప్రత్యేక శ్రద్ధతో నిధులు మంజూరు చేయించారు. గతంలో కుడికాల్వ 7.8కిలోమీటర్లు ఆధునీకరణ చేయగా ఇప్పుడు మళ్లీ 20.5కిలోమీటర్ వరకు అంటే 12.7కిలోమీటర్లు ఆధునీకరణకు మంజూరు చేయాల్సి ఉంది. అలాగే 4, 28వ డిస్ట్రిబ్యూటరీలను అభివృద్ధి చేయాల్సి ఉంది. ఎడమకాల్వ గతంలో 9.5కిలోమీటర్లు అభివృద్ధి చేయగా ఇప్పు డు అక్కడి నుంచి గరికపాడు వెళ్లే కెనాల్ మూడున్నర కిలోమీటర్లు, లింగన్నపాలెం బ్రాంచ్ కెనాల్ రెండు కిలోమీటర్లు, 7,8డిస్ట్రిబ్యూటరీలు సహా పలు డిస్ట్రిబ్యూటరీలను ఆధునీరణ చేయాల్సి ఉంది.ఈ మొ త్తానికి రూ.86.80కోట్ల నిధులు అవసరం కాగా ఇప్పుడు రూ.42.10 కోట్ల నిధులు మాత్రమే మంజూరయ్యాయి. ఇంకా పూర్తిస్థాయిలో ఆధునికీకరణకు రూ.45కోట్లు అవసరముంది. గతంలో రూ.65కోట్లు గైడ్ వాల్స్ ఇవ్వగా, ప్రస్తుతం కేవ లం సీసీ వాల్‌కే నిధులు విడుదల చేయడం గమనార్హం. కాగా సీసీ వాల్ ఈ కాల్వలకు అనుకూలంగా ఉండదని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

గీత దాటితే వేటే..

- లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ విడుదలతో అమల్లోకి కోడ్

ఖమ్మం కలెక్టరేట్, మార్చి16: లోక్‌సభ ఎన్నికలకు కేంద్ర ఎన్నికల కమిషన్ శనివారం షెడ్యూల్‌ను ప్రకటించింది. ఈ నేపథ్యంలో జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో వచ్చింది. రాజకీయ పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులు ప్రచారం మొదలు ఓట్ల లెక్కింపు వరకు ఎన్నికల ప్రక్రియ పూర్తి స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్వహించేందుకు ఎన్నికల కమిషన్ నిబంధనలను అమలు చేసే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. ఇప్పటి వరకు ఆ యా రాజకీయ నాయకుల చేతిలో నడిచినపాలన మొత్తం ఎన్నికల కమీషన్ పరిధిలోకి వెళ్తుంది. అధికారులు కోడ్ అమలుకు నిక్కచ్చిగా వ్యవహరించనున్నారు. ఎమ్మెల్యేలు, మంత్రులు, ఇతర రాజకీయ పార్టీల కనుసన్నల్లో పనిచేసిన యంత్రాంగం పూర్తిగా వారి కదలికల పైనే నిఘా పెట్టనున్నారు. మారుతున్న ఆధునిక పరిస్థితుల్లో సామాజిక మా ధ్యమాల ద్వారా ఎప్పటికపుడు సమస్యలను గుర్తించి వాటి ని తక్షణం పరిష్కరించేలా చర్యలు తీసుకుంటారు.

- కోడ్ ప్రకటించిన వెంటనే ప్రభుత్వ పథకాల ఫ్లెక్సీలు, పోస్టర్లను, కార్యాలయాల్లో ఉన్న ప్రధాని, సీఎం ఫోటోలను తొలగించాలి. కోడ్ ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకునేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. రాజకీయ పా ర్టీలు, అభ్యర్థులు అనుసరించాల్సిన నిబంధనలు, అధికారుల ఏర్పాట్లు, సామాన్య ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఇలా...

అభ్యర్థులు పాటించాల్సిన నియమాలు...

- కోడ్ అమలులోకి వచ్చిన వెంటనే ర్యాలీలు, ధర్నాలు, ఆందోళనలు, రాస్తారోకోలు ఇతర నిరసన కార్యక్రమాలు చేపట్టొద్దు.
- ప్రభుత్వ భవనాలు, వాహనాలు ప్రచారం కోసం వినియోగించరాదు. ప్రచారంలో వ్యక్తిగత విమర్శలకు దిగకుండా అంశాల వారిగానే విమర్శలు చేయాలి.
- విద్వేషాలు రెచ్చగొట్టేలా ప్రసంగాలు ఉండొద్దు.
- ప్రార్థనా మందిరాల్లోకి వెళ్లి ఓట్లను అభ్యర్థించొద్దు. ఓటర్లకు బహుమతులు ఇస్తూ వారిని ప్రలోభాలకు గురిచేయరాదు.
- ప్రచార సమయంలో ప్రత్యర్థి పార్టీలు ఎదురెదురుగా రాకుండా స్వీయ నియంత్రణ పాటించాలి.
- పార్టీల ప్రచార ప్రతులను ఇతర పార్టీల వారు చింపొద్దు.
- మాధ్యమాల్లో పార్టీలపై విమర్శలు చేస్తూ పోస్టింగులు పెట్ట కూడదు.

ఎన్నికల ప్రచారంలో పాటించాల్సిన జాగ్రత్తలు..

- అభ్యర్థి ప్రచారానికి మూడు వాహనాలను మాత్రమే వినియోగించాల్సి ఉంటుంది. వీటికి సైతం ఎన్నికల అధికారి నుంచి అనుమతిపత్రం తప్పనిసరి.
- ప్రచారానికి రిటర్నింగ్ అధికారి అనుమతించిన తరువాత ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు మాత్రమే ప్రచారం నిర్వహించాలి.
- ఎన్నికల నిబంధనల ఉల్లంఘనలకు సంబంధించి రాత్రి, పగలు తేడా లేకుండా ఎప్పు డైనా ఫిర్యాదు చేయవచ్చు.
- ప్రైవేటు స్థలాల్లో ప్రచారానికి ఇంటి, స్థల యజమాని అనుమతి విధిగా తీసుకోవాలి.
- అభ్యర్థులు ప్రతిరోజు చేసే ప్రచార ఖర్చుల వివరాలను ఎప్పటికప్పుడు అధికారులకు అందజేయాల్సి ఉంటుంది.
- ముందస్తు అనుమతి తీసుకుని జరిపే ర్యాలీ, ప్రచారం, సభలు, సమావేశాలు నిర్దేశిత సమయంలోనే ముగించాలి.
- రాజకీయ పార్టీలు ప్రచార ప్రకటనలు, లౌడ్ స్పీకర్లను వినియోగించేందుకు ప్రత్యేకంగా అనుమతి తీసుకోవాలి.

అంగన్వాడీలకు ఒంటి పూట బడులు

మహిళ శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ నుంచి ఆదేశాలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



అంగన్వాడీ కేంద్రంలో ఉన్న పిల్లలు

కల్లూరు, ఖానాపురం హవేలి, మార్చి 16 మహిళ శిశు సంక్షేమ శాఖ పరిధిలో పని చేస్తున్న అంగన్వాడీ కేంద్రాలకు ఒంటి పూట బడులను అమలు చేస్తూ మహిళ శిశు సంక్షేమశాఖ డైరెక్టర్ కార్యాలయం నుంచి శనివారం జిల్లాలో గల పలు ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారులకు ఆదేశాలు అందాయి. శనివారం ఆంధ్రజ్యోతిలో అంగన్వాడీలకు ఒంటిపూట బడులు వర్తించదా అనే శీర్షికతో కథనం ప్రచురితమైన విషయం విదితమే. సదరు జీవో నెం 954- ఐసీడీఎస్-2, 2024 ప్రకారం ఇకపై ఉదయం 8 గంటల నుంచి మధ్యహ్నం12.30 నిమిషాల వరకు సమయ పాలన పాటిస్తూ అంగన్వాడీ కేంద్రాలు నడుపాలని ఆదేశించారు. ఆ ప్రకారం అంగన్వాడీ కేంద్రాల్లో గల పిల్లలకు విద్యాపరమైన, గర్భిణులకు, బాలింతలకు పోషక ఆహారం అందించటం వంటి సేవలు ఆయా సమయంలో తప్పకుండ అమలు చేయాలని ఆదేశించనైనది. ఆ తరువాత మధ్యాహ్నం సమయనంతరం కేంద్రాల సంవత్సరం సర్వే, హోం విజిట్స్, పిల్లల నమోదు, ప్రీస్కూల్ అడ్మిషన్లు వంటి కార్యక్రమాలు టీచర్లు, ఆయాలు చేపట్టాలని ఆ జివోలు తెలియపరింది ప్రభుత్వం. దీంతో జిల్లాలో గల ఏడు ప్రాజెక్టుల పరిధిలో గల 1830 కేంద్రాలలో సేవలు పొందుతున్న 19,747 మంది పిల్లలకు నేటి నుంచి నుంచి ఈ ఆదేశాలు వర్తించనున్నాయి. దీంతో పిల్లలకు వేసవి ఉపసమనం కలగనున్నది.

ఉమ్మడి ఖమ్మం విద్యుత్ ఉద్యోగుల ప్రతిభ

ఖమ్మం సంక్షేమవిభాగం, మార్చి 16: తెలంగాణ రాష్ట్ర విద్యుత్‌శాఖల ఆధ్వర్యంలో శనివారం యాదగిరి గుట్టలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి క్రీడల్లో ఖమ్మం జిల్లా ఉద్యోగులు ప్రతిభను కనబర్చారు. రాష్ట్ర స్థాయి లో పలు క్రీడల్లో ప్రథమ, ద్వితీయ స్థానాలను కైవసం చేసుకున్నారు. మహిళా విభాగం అథ్లెటిక్స్‌లో లావణ్య(మధిర), రేణుక(ఖమ్మం), శ్రావంతి(తల్లాడ), హరిత(ఖమ్మం); లిఖిత(కొత్తగూడెం), శేషశ్రీ(ఖమ్మం) అవార్డులను కైవసం చేసుకున్నారు. అలాగే పురుషుల విభాగంలో ప్రసాద్(ఖమ్మం) జయప్రకాష్,(ఖమ్మం), నరేష్(ఖమ్మం), కృష్ణమూర్తి(వైరా),నాగేశ్వరరావు(తిరుమలాయపాలెం) ఫణికుమార్(కొణిజర్ల), శమ్ముఖచారి(సత్తుపల్లి), శేఖర్‌బాబు(ఖమ్మం), నాగేశ్వరరావు(ఖమ్మం), సూర్యప్రకాష్(తల్లాడ), నాగేశ్వరరావు(బల్లేపల్లి), రామారావు(ముదిగొండ) అవార్డులను కైవసం చేసుకున్నారు. అవార్డులు పొందిన ఉద్యోగులను క్రీడల కౌన్సిల్ చైర్మన్ సురేందర్ అభినందించారు.



అవార్డులను అందుకుంటున్న ఖమ్మం జిల్లా ఉద్యోగులు

ఘనంగా వేంకటేశ్వరస్వామికి సర్వాంగాభిషేకం



శ్రీవారిని పల్లకిలో ఊరేగిస్తున్న భక్తులు

ఎర్రుపాలెం, మార్చి 16: జమలాపురం వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీవారికి సర్వాంగాభిషేకం, గిరి ప్రదక్షణ శనివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన తర్చకులు ఉప్పల శ్రీనివాస్‌శర్మ ఆధ్వర్యంలో సుగంధద్రవ్యాలతో, పంచామృతాలతో శ్రీవారికి సర్వాంగాభిషేకం, ప్రత్యేక పూజలు జరిపించారు. శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారి ఉత్సవ విగ్రహాలను మేళ తాళాలతో పల్లకిలో ఊరేగించి కల్యాణవేదిక వద్దకు చేర్చారు. అనంతరం భక్తుల ఆధ్వర్యంలో నిత్యకల్యాణం నిర్వహించారు. భక్తులు పొంగళ్లను నివేదించి తమ మొక్కులను తీర్చుకున్నారు. భక్తులకు ఆలయ అధికారులు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి కొత్తూరు జగన్‌మోహన్‌రావు, ఆలయ సూపరింటెండెంట్ విజయకుమారి పాల్గొన్నారు.

రసాయన ఎరువులపై అవగాహన కల్పించాలి

- జిల్లా వ్యవసాయ అధికారి విజయ నిర్మల



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి విజయనిర్మల

ఖమ్మంవ్యవసాయం, మార్చి16: రైతులతో మమేకమై చీడ పీడలు, రసాయనిక ఎరువులపై అవగాహన కల్పించాలని జిల్లా వ్యవసాయ అధికారి ఎం.విజయ నిర్మల అన్నారు. వీవీపాలెం రైతువేదికలో ఆత్మ పీడీ ఆధ్వర్యంలో శనివారం జిల్లాలోని వివిధ మండలాల నుంచి వచ్చిన 80 మంది ఇన్పుట్ డీలర్స్‌కు (ఎరువులు మరియు పురుగు మందుల వ్యాపారస్తులు) శిక్షణను ఆమె ప్రారంభించారు. శిక్షణ తరగతులు అన్ని పూర్తి అయిన వెంటనే పరీక్షలు నిర్వహిస్తామని సర్టిఫికేట్ అందజేస్తామన్నారు. జిల్లా ఉద్యాన అధికారి రమణ, మత్స్యశాఖ అధికారి ఆంజనేయస్వామి, జిల్లా పశువర్ధక శాఖ అధికారి వేణుమనోహర్, కేవీకే - కో ఆర్డినేటర్ రవి , మధిర శాస్త్రవేత్త భరత్, డీపే సరిత ఆయా రంగాల్లో అంశాలపై శిక్షణ ఇచ్చారు.

నోట్‌బుక్స్ వితరణ చేసిన తుమ్మల మనువడు



విద్యార్థులతో తుమ్మల మనవడు హితేష్

దమ్మపేట, మార్చి 16: వ్యవసాయశాఖామంత్రి తుమ్మల నాగేశ్వరరావు మనుమడు వల్లభనేని హితేష్ దురదపాడు గ్రామంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శనివారం యుక్తాఫౌండేషన్ ఆధ్వర్యంలో నోట్‌పుస్తకాలు, పెన్నులు, బిస్కెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, ఉపాధ్యాయులు, విద్యార్థులతో మాట్లాడి పాఠశాల సమస్యలు తెలుసుకున్నారు. పాఠశాలకు అవసరమైన మౌలిక సదుపాయాలు యుక్తా ఫౌండేషన్ ద్వారా కల్పించనున్నట్లు తెలిపారు. పాఠశాల ప్రధాన సమస్యలను తాతయ్య తుమ్మల దృష్టికి తీసుకువెళతానని తెలిపాడు. మండలంలో మరిన్ని పాఠశాలలు సందర్శించి సదుపాయాలు కల్పిస్తానని తెలిపాడు. హితేష్ హైద్రాబాద్‌లోని ఒక ప్రైవేట్ పాఠశాలలో 9వతరతగతి పూర్తి చేసాడు. ఈ కార్యక్రమంలో కాసాని నాగప్రసాదు, తుమ్మల శేషుబాబు, కేవీ సత్యనారాయణ, ఎర్రా వసంతరావు, మన్నెం అప్పారావు పాఠశాల హెచ్‌ఎం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

విజయవంతమైన జాతీయ లోక్ అదాలత్



లోక్ అదాలత్ నిర్వహిస్తున్న 3వ అదనపు న్యాయాధికారి శ్రీరాంప్రసాదరావు

ఖమ్మం లీగల్, మార్చి 16: ఖమ్మం జిల్లా ప్రధాన న్యాయాధికారి బి.ఎస్. జగ్జీవన్‌కుమార్ ఆధ్వర్యంలో శనివారం జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 3,97,227 కేసులు పరిష్కారమయ్యాయి. లోక్ అదాలత్ విజయవంతానికి గాను న్యాయసేవాధికారసంస్థ కార్యదర్శి, ప్రిన్సిపల్ సీనియర్ న్యాయాధికారి మహ్మద్ అబ్దుల్ జావీద్‌పాషా గత నెలలోనే జాతీయ లోక్ అదాలత్ బెంచిలను ఏర్పాటు చేయగా, మార్చి 1 నుంచి ముందస్తు లోక్ అదాలత్ పరిష్కారాలు ప్రారంభమయ్యాయి. మొదటి అదనపు జిల్లా న్యాయాధికారి కె.ఉమాదేవి 541 విద్యుత్ చౌర్యం కేసులను పరిష్కరించారు. మూడో అదనపు జిల్లా న్యాయాధికారి డి. రాంప్రసాదరావు మోటారు వాహన ప్రమాద కేసులు 55 లను పరిష్కరించి బాధితులకు రూ.1.02 కోట్ల నష్టపరిహారం ఇప్పించారు. ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ న్యాయాధికారి మహమ్మద్ అబ్దుల్ జావీద్‌పాషా సివిల్ కేసులను పరిష్కరించటంతోపాటు న్యాయసేవాసంస్థ కార్యదర్శి హోదాలో వివిధ బెంచిలను సమన్వయపరిచారు. ప్రధాన జూనియర్ సివిల్ న్యాయాధికారి పి.గోపిక నాగశ్రావ్య సైబర్ క్రైం కేసులను, బ్యాంకు కేసులతోపాటు మొత్తం 70 కేసులు పరిష్కరించారు. మొదటి అదనపు జూనియర్ సివిల్ న్యాయాధికారి కె.దీప అధ్యక్షతన నిర్వహించిన లోక్ అదాలత్ బెంచిలో మొత్తం 246 కేసులు పరిష్కారమయ్యాయి. రెండో అదనపు జూనియర్ సివిల్ న్యాయాధికారి ఏపూరి బిందుప్రియ 1858 కేసులను పరిష్కరించారు. మూడో అదనపు జూనియర్ సివిల్ న్యాయాధికారి వి.మాధవి 312 కేసు లను పరిష్కరించారు. ఎక్సైజ్ కోర్టు న్యాయాధికారి ఆర్.శాంతిలత 128 కేసులను పరిష్కరించారు. మొబైల్ కోర్టు న్యాయాధికారి బి.రజని అధ్యక్షతన నిర్వహించిన లోక్ అదాలత్ బెంచి 312 కేసులను పరిష్కరించారు. ద్వితియశ్రేణి న్యాయమూర్తి సలీం ట్రాఫిక్ కేసులు, తదితర పెటీ కేసులు 3,92,510 లను పరిష్కరించారు. సత్తుపల్లి కోర్టునందు 1052, మధిర కోర్టులో 680 కేసులను పరిష్కరించారు. పలువురు న్యాయవాదులు లోక్ అదాలత్ సభ్యులుగా వ్యవహరించారు.

సరిహద్దు సంకటం

- తెలంగాణ ఇసుక లారీలను అడ్డుకుంటున్న ఏపీ పోలీసులు
- ఏపీ ప్రజాప్రతినిధి జోక్యంతో ముదిరిన ఇసుక వివాదం
- దుమ్ముగూడెం మండలం తూరుబాక ర్యాంపు వద్ద లారీ డ్రైవర్ల ఆందోళన
- సమస్యను పరిష్కరించని టీఎస్‌ఎండీసీ



తూరుబాక ఇసుక ర్యాంప్ వద్ద బారులుదీరిన లారీలు

దుమ్ముగూడెం మార్చి 16: ఆంధ్రా, తెలంగాణ సరిహద్దు సమస్య రాష్ట్ర ప్రభుత్వ ఇసుక రవాణాపై ప్రభావం చూపుతోంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో భద్రాచలం-పర్ణశాల మార్గంలో రాజుపేట, తూరుబాకల మధ్య తొమ్మిది కిలోమీటర్ల మేర రహదారి ఆంధ్రాలో ఉంటుంది. ఇక్కడ తరుచూ సరిహద్దు సమస్యలు తలెత్తుతున్నాయి. ఈ క్రమంలో ఇటీవల దుమ్ముగూడెం మండలం-భద్రాచలం మధ్య ఏపీలోని ఎటపాక పోలీస్‌స్టేషన్ వద్ద తెలంగాణకు చెందిన ఇసుక లారీలను నిలిపేశారు. దాంతో ఈ సరిహద్దు సమస్యను పరిష్కరించాలని, ఇసుక ర్యాంపు వద్ద త్వరితగతిన లోడింగ్ చేయాలని లారీ డ్రైవర్లు తూరుబాక ఇసుక ర్యాంపు వద్ద ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారిపై శనివారం రాస్తారోకో చేశారు. ఇసుక పర్మిట్లు తీసుకొని వారం రోజులుగా ర్యాంపు వద్ద వేచు ఉన్నా ఇసుక లోడింగ్ చేయడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. రవాణా అనుమతులిచ్చిన టీఎస్‌ఎండీసీ అధికారులు సరిహద్దు సమస్యను పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే ర్యాంపు వద్ద డ్రైవర్లకు సరైన సదుపాయాలు కూడా లేవని అసహనం వ్యక్తం చేశారు. నిబంధనల ప్రకారం అన్ని రకాల అనుమతులతో తూరుబాక ర్యాంపులో ఇసుక లోడింగ్ చేసుకొని వెళ్తున్న పదిహేను లారీలను ఈనెల 14న ఏపీ పరిధిలోని ఎటపాక పోలీసులు పట్టుకున్నారు. తూరుబాక ర్యాంపు వద్ద గత ఏడాది పోగేసిన ఇసుక లాట్లను వారంలోగా తరలించాలనే ఉద్దేశంతో మిగతా ర్యాంపుల వద్ద లోడింగ్‌ను నిలిపేసి ఒక్క తూరుబాక ర్యాంపు నుంచే లోడింగ్‌కు టీఎస్‌ఎండీసీ పర్మిట్లు ఇచ్చినట్లు తెలుస్తోంది. దీంతో పెద్ద సంఖ్యలో లారీలు తూరుబాక ర్యాంపు వద్దకు చేరుకున్నాయి. అన్ని రకాల అనుమతులున్నా, తూరుబాక నుంచి భద్రాచలం వైపు వెళ్లే ఇసుకలారీలను ఎటపాక పోలీసులు నిలిపివేస్తుండడంతో గత మూడు రోజులుగా ర్యాంపులో లోడింగ్ నిలిచిపోయింది. లారీ డ్రైవర్లు ఆందోళనతో ట్రాఫిక్ నిలిచిపోవడంతో సీఐ అశోక్ తన సిబ్బందితో వెళ్లి వారితో మాట్లాడి ఆందోళనను విరమింపజేశారు. హైదరాబాద్ వైపు వెళ్లే లారీలు చర్ల-వెంకటాపురం మీదుగా వెళ్లాలని సూచించారు. ఆంధ్రా సరిహద్దుల మీదుగా భద్రాచలం నుంచి ఖమ్మం వైపు వెళ్లే లారీల సమస్య మాత్రం పరిష్కారం జరగలేదు.

ఏపీ ప్రజాప్రతినిధి జోక్యంతో ముదిరిన వివాదం

జీరో బిల్లులతో రవాణా జరుగుతోందని కొద్ది రోజుల క్రితం ఆంధ్రాకు చెందిన కొన్ని ఇసుక లారీలను సారపాక వద్ద తెలంగాణ పోలీసులు సీజ్ చేశారు. దీంతో ఆగ్రహించిన ఏపీకి చెందిన ఎమ్మెల్సీ ఒకరు ఎటపాక పోలీసులపై ఒత్తిడి తెచ్చి తెలంగాణాకు చెందిన ఇసుక లారీలను నిలిపేయాలని ఆదేశించినట్లు తెలుస్తోంది. ఈనెల 14న ఎటపాక పోలీసులు పట్టుకున్న ఇసుక లారీలను ఇప్పటికీ వదలకపోవడం, పైగా తూరుబాక ర్యాంపు నుంచి వెళ్లే ఇసుక లారీలను అడ్డుకుంటామని ఎటపాక పోలీసుల హెచ్చరికలతో తెలంగాణా ఇసుక రవాణాపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఈ నేపథ్యంలో ఇసుక రవాణా కోసం టీఎస్‌ఎండీసీ పర్మిట్లు తీసుకున్న లారీ డ్రైవర్ల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.

బాధ్యతలు స్వీకరించిన భూగర్భశాఖ ఏడీ



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న దృశ్యం

ఖమ్మం ఖానాపురంహవేలి మార్చి 16: ఖమ్మం జిల్లా గనులు భూగర్భ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సాయినాథ్ శనివారం కలెక్టర్ వీపీ గౌతమ్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి నంతరం బాధ్యతలు స్వీకరించారు. పెద్దపల్లి జిల్లా ఏడీగా విధులు నిర్వహిస్తున్న సాయినాథ్‌ను ఖమ్మంకు బదిలీ చేయగా ఆయన బాధ్యతలు తీసుకున్నారు. ప్రస్తుతం ఏడిగా విధులు నిర్వహిస్తున్న సంజయ్‌కుమార్‌ను మహబూబ్‌నగర్‌కు బదిలీ చేశారు.

వైరా ఏడీఏగా బాధ్యతలు చేపట్టిన కరుణశ్రీ



వైరా, మార్చి 16: వైరా డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు (ఏడీఏ)గా టి.కరుణశ్రీ శనివారం బాధ్యతలు చేపట్టారు. వైరా మార్కెట్ కమిటీ యార్డులోని వ్యవసాయశాఖ డివిజన్ కార్యాలయంలో కరుణశ్రీ ఏడీఏగా బాధ్యతలు చేపట్టారు. నెలరోజుల కిందట వైరా ఏడీఏగా ఉన్న వి.బాబూరావు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వ్యవసాయశాఖ అధికారిగా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ఇప్పటివరకు మిట్టపల్లి సతీష్‌కుమార్ బాధ్యతలు నిర్వహించారు. ఇప్పుడు కరుణశ్రీ ఏడీగా బాధ్యతల్లోకి వెళ్లారు. వైరా ఏవో ఎస్.పవన్‌కుమార్, ఏడీఏ కార్యాలయ టెక్నికల్ ఏవో వాహిని, సీనియర్ అసిస్టెంట్‌లు లక్ష్మీ, స్వరూప శుభాకాంక్షలు తెలిపారు.

ఎన్నికల నియమావళిని పాటించాలి

కొత్తగూడెం కలెక్టరేట్ మార్చి 16: జిల్లాలో సజావుగా పార్లమెంట్ ఎన్నికల నిర్వాహణకు ప్రతి ఒక్కరు సహకరించాలని, ప్రతి ఒక్కరూ ఎన్నికల ప్రవర్తన నియమావళిని తూచా తప్పకుండా పాటించాలని జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ ప్రియాంక అన్నారు. శనివారం రాత్రి భారత ఎన్నికల కమీషన్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సులో ఎస్పీ రోహిత్‌రాజాతో కలిసి ఆమె పాల్గొన్నారు. ఈసదర్భంగా ఆమె మాట్లాడుతూ భారత ఎన్నికల కమిషన్ పార్లమెంట్ ఎన్నికల నిర్వాహణకు సంబంధించి షెడ్యూల్ విడుదల చేశారన్నారు.

కాంగ్రెస్‌కు చందా లింగయ్య గుడ్‌బై

- మానుకోట ఎంపీ టికెట్ ఇవ్వకపోవడమే కారణం
- ఇండిపెండెంట్‌గా పోటీచేస్తానని వెల్లడి



రాజీనామా చేస్తున్నట్లు ప్రకటిస్తున్న చందా లింగయ్య

కరకగూడెం, మార్చి 16: జాతీయ ఆదివాసీ అఖిల పక్షం ప్రజా సంఘాల చైర్మన్, మాజీ ఎమ్మెల్యే చందా లింగయ్య దొర కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేశారు. తన రాజీనామా లేఖను టీపీసీసీ రాష్ట్ర ఇంచార్జ్ దీపాదాస్ మున్షి, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గేకు పంపించినట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో శనివారం భద్రాద్రి జిల్లా కరకగూడెం మండలం చిరుమళ్ల సమ్మక్క, సారలమ్మ ఆలయం వద్ద సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా లింగయ్యదొర మాట్లాడుతూ కలెక్టర్ ఉద్యోగం వచ్చినా ఆదివాసీ గ్రామాలకు సేవ చేయాలనే లక్ష్యంతో 1974లో ఇందిరా గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీలో చేరి 20 ఆర్థిక సూత్రాలను భూజాన వేసుకుని ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ విజయమే లక్ష్యంగా పనిచేశామని గుర్తు చేశారు. మానుకోట ఎంపీ టికెట్ కోసం అధిష్టానానికి దరఖాస్తు చేసినా పట్టించుకోకుండా నాలుగులక్షల మంది ఆదివాసీలున్న నియోజకవర్గంలో లంబాడీలకు టికెట్ కేటాయించడంపై మండిపడ్డారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో మహబూబాబాద్ నుంచి ఆదివాసీ తరుపున ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీచేస్తున్నట్లు ప్రకటించారు. అనంతరం బీజేపీ, కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీల దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు వట్టం ఉపేందర్, తుడుందెబ్బ జాతీయ కన్వీనర్ రమణాల లక్ష్మయ్య, ఆదివాసీ సంఘాల సమన్వయ కర్త చుంచు రామక్రిష్ణ, జీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు పాయం సత్యనారాయణ, ఆదివాసీ పొలిటికల్ జేఏసీ చైర్మన్ వాసం రామకృష్ణ, రిటైర్డ్ ఏఎస్పీ కొర్స సీతారాములు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా తుడుందెబ్బ అధ్యక్షులు వర్స శ్రీను, తదితరులు పాల్గొన్నారు.



అభివాదం చేస్తున్న నాయకులు

ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
కొత్తగూడెం, ఇల్లెందు, భద్రాచలం, పినపాక, అశ్వారావుపేట
భద్రాద్రి కొత్తగూడెం
ఆదివారం 17 మార్చి 2024



బ్రహ్మోత్సవాలను జయప్రదం చేయండి

అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ

అన్నపురెడ్డిపల్లి, మార్చి 16: మండల కేంద్రంలోని కాకతీయుల కాలంనాటి బాలాజీ ఆలయానికి వార్షిక బ్రహ్మోత్సవాలను జయప్రదం చేయాలని ఆశ్వారావుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే జారే ఆదినారాయణ కోరారు. శనివారం బాలాజీ బ్రహ్మోత్సవాలకు సంబంధించిన వాల్ పోస్టర్లను ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ఆలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలాజీ బ్రహ్మోత్సవాలు ఈ నెల 23న ప్రారంభమై 28న ముగుస్తాయని తెలిపారు. 27వ తేదిన స్వామి వారి తిరుకళ్యాణమహోత్సవంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు పరిశీలించాలని ఉత్సవకమిటి, ఆలయ సిబ్బందికి ఆయన సూచించారు.

కవిత అరెస్టుపై బీఆర్ఎస్ నిరసన

పలు చోట్ల రాస్తారోకో, ధర్నాలు

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, మార్చి16: ఎమ్మెల్సీ కవితను ఈడి అధికారులు అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ కొత్తగూడెంలో బీఆర్ఎస్ శ్రేణులు ఆందోళన నిర్వహించాయి. శనివారం బస్టాండ్ సెంటర్‌లోని అమర వీరుల స్థూపం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు మాట్లాడారు. అరెస్టులతో బీఆర్ఎస్ శ్రేణులను, కేసీఆర్ కుటుంబాన్ని భయపెట్టలేరని అన్నారు. నిరసన చేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులను పోలీసులు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కోనేరు సత్యనారాయణ (చిన్ని), చుంచుపల్లి, లక్ష్మీదేవిపల్లి ఎంపీపీలు బాదావత్ శాంతి, భూక్యా సోన, కో-ఆప్షన్ సభ్యులు బుచ్చయ్య, మండల అధ్యక్షులు కొట్టి వెంకటేశ్వర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.


ఇల్లెందులో నిర్వహించిన బైక్ ర్యాలీ

చండ్రుగొండలో..

చండ్రుగొండ: బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దారా బాబు, జడ్పీటీసీ వెంకటరెడ్డి ఆధ్వర్యంలో చండ్రుగొండలో బంద్ నిర్వహించి, రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ వెంకటరెడ్డి మాట్లాడుతూ మోదీ ఈడీ, సీబీఐ, ఐటీ సంస్థలతో ప్రతిపక్ష నేతలను వేధింపులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సూరా వెంకటేశ్వర్లు, భూపతి రమేష్, గుగులోత్ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఇల్లెందులో నిరసన ర్యాలీ, ధర్నా

ఇల్లెందు: రాజకీయ కుట్రతోనే రాజ్యాంగ సంస్థలను జేబు సంస్థలుగా మార్చుకొని బీజేపీ ప్రభుత్వం ఎమ్మెల్సీ కవితను అరెస్టు చేయించిందని మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ, బీఆర్ఎస్ జిల్లా మాజీ అధ్యక్షులు దిండిగల రాజేందర్ హెచ్చరించారు. కవిత అరెస్టును నిరసిస్తు పట్టణంలో శనివారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ద్విచక్ర వాహనాల ర్యాలీ తెలంగాణ తల్లి విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా హరిప్రియ మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల తరుణంలో సుప్రీంకోర్టు ఆదేశాలు ఖాతరు చేయకుండా విచారణల పేరిట జాప్యం చేస్తూ, మహిళ అనే విచక్షణ మరిచిపోయి కవితను అరెస్టు చేశారని ఆరోపించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు జేకే శ్రీనివాస్, కటకం పద్మవతి, అనిత, పద్మ, తార, బీఆర్ఎస్ నాయకులు సిలివేరు సత్యనారాయణ, యర్రవెల్లి కృష్ణయ్య, శీలం రమేష్, పోషం, సరిత, చంద్రవతి, కృష్ణరావు, లాల్‌సింగ్, జాబ్బర్, గిన్నరపు రాజేష్, మున్నాఫ్ తదితరులు పాల్గొన్నారు.



కొత్తగూడెంలో నిర్వహించిన నిరసన

న్యాయ గ్రంథాలయం ప్రారంభం


లోక్ అదాలత్‌లో మాట్లాడుతున్న పాటిల్

మణుగూరుటౌన్, మార్చి 16: మణుగూరు ప్రథమ శ్రేణి జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ కోర్టు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన న్యాయ గ్రంథాలయాన్ని జిల్లా ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ జడ్జి వసంత్ పాటిల్ శనివారం ప్రారంభించారు. న్యాయ లైబ్రరీని ప్రారంభించేందుకు మణుగూరు వచ్చిన జిల్లా జడ్జితోపాటు తెలంగాణ బార్ కౌన్సిల్ సభ్యుడు కొల్లి సత్యనారాయణ, కొత్తగూడెం జిల్లా కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రమేష్‌కుమార్ మక్కడ్, మణుగూరు డీఎస్పీ రవీందర్‌రెడ్డిలకు మణుగూరు బార్ అసోసియేషన్ సభ్యులు ఘన స్వాగతం పలికారు. జిల్లా జడ్జి, బార్ కౌన్సిల్ సభ్యులు కోర్టు ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం జిల్లా జడ్జీ లైబ్రరీని ప్రారంభించారు. అనంతరం మణుగూరు కోర్టు ఆవరణలో జరిగిన మెగా లోక్ అదాలత్‌లో పాల్గొని కక్షిదారులను, బార్ అసోసియేషన్ న్యాయవాదులను ఉద్దేశించి మాట్లాడారు. కొల్లి సత్యనారాయణ, రమేష్ కుమార్ మక్కడ్, డిఎస్పీ రవీందర్‌రెడ్డిలు మాట్లాడారు.

1,199 కేసులు పరిష్కారం..

మణుగూరు కోర్టు ప్రాంగణంలో శనివారం జరిగిన మెగా లోక్ అదాలత్‌లో మొత్తం 1,199 కేసులు పరిష్కారమయ్యాయి. ఖమ్మం సీనియర్ న్యాయవాది శరత్‌చంద్ర మృతికి సంతాపక సూచకంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం లోక్ అదాలత్‌లో ముఖ్య అతిథిగా జిల్లా జడ్జి, జిల్లా వసంత్ పాటిల్ కక్షిదారులకు అవార్డు కాపీలను అందజేశారు. కార్యక్రమంలో బార్ అధ్యక్షులు ఎం.శ్రీనివాస్, సెక్రటరీ చిర్ర రవి, న్యాయవాదులు కందిమళ్ల నర్సింహారావు, కిషన్‌రావు, విజయరావు, శైలజ, సావిత్రి పాల్గొన్నారు.

కుష్టు వ్యాధి నిర్మూలనకు కృషి చేయాలి


సర్వేను పరిశీలిస్తున్న జ్ఞానేశ్వర్

జూలూరుపాడు, మార్చి16: కుష్టు వ్యాధి నిర్మూలనకు ప్రజలందరు కృషి చేయాలని రాష్ట్ర కుష్టు వ్యాధి నిర్ధారణ సర్వే మానిటరింగ్(ఎల్‌సిడిసి) అధికారి డాక్టర్ జ్ఞానేశ్వర్ అన్నారు. గ్రామాలలో కుష్టు వ్యాధి వారిని గుర్తించేందుకు వైద్యశాఖ అధ్వర్యంలో ఈ నెల 11వ తేదీ నుంచి 24 వరకు ఇంటింటి సర్వే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా శనివారం ఆయన జూలూరుపాడు ప్రభుత్వాసుపత్రిని సందర్శించారు సిబ్బంది చేపడుతున్న ఇంటింటి సర్వే కార్యక్రమాన్ని పరిశీలించి సంతృప్తిన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు కుష్టు వ్యాధి పట్ల అవగాహన కలిగి ఉండాలని, తొలి దశలోనే ఈ వ్యాధిని గుర్తించినట్లయితే అంగవైకల్యం రాకుండా నివారించవచ్చన్నారు. గ్రామాలలో ఉన్న వ్యాధిగ్రస్తులను త్వరితగతిన గుర్తించేందుకు సర్వేను చేపడుతున్నట్లు తెలిపారు.

'పది' విద్యార్థులకు పరీక్ష కిట్‌ల పంపిణీ



కిట్‌లను పంపిణీ చేస్తున్న జీఎం బసవయ్య

చుంచుపల్లి, మార్చి16: పదో తరగతి వార్షిక పరీక్షలో పాల్గొనే విద్యార్థులకు ఫ్రెండ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆనందఖని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పరీక్ష కిట్‌లను శనివారం పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సింగరేణి జీఎం కె.బసవయ్య పాల్గొని విద్యార్థులకు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్ష సమయంలో ఒత్తిడికి లోనవకుండా ప్రశాంతంగా ఉండి పరీక్ష రాయాలని విద్యార్థులను కోరారు. విద్యార్థులకు సామాజిక స్పృహతో ఉచితంగా పరీక్షా కిట్‌లను పంపిణీ చేస్తున్న ఫ్రెండ్స్ ఫౌండేషన్ నిర్వాహకులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు జి.లక్ష్మీ, ఏజీఎం పర్సనల్ కె.శ్రీనివాసరావు, భజరంగ్‌దళ్ జిల్లా సమయోజక్ చింతేశ్వర్, దాత పోదూరు నగేష్, ఫౌండేషన్ సభ్యులు శ్రీకాంత్, ఉదయ్, కౌషిక్, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి



మాట్లాడుతున్న కల్లోజి శ్రీనివాస్

లక్ష్మీదేవిపల్లి, మార్చి 16: పదో తరగతి అనేది విద్యార్థి దశలో కీలక మలుపు అని, విద్యార్థులు కృషి, పట్టుదలతో చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని టీయుడబ్ల్యుజే జిల్లా అధ్యక్షుడు కల్లోజి శ్రీనివాస్ విద్యార్థులకు సూచించారు. శనివారం మండల పరిధిలోని హేమచంద్రాపురం ఉన్నత పాఠశాలలో పది విద్యార్థులకు ప్యాడ్లు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించి పాఠశాలకు పేరు ప్రతిష్టలు తీసుకురావాలని ఆకాంక్షించారు. పరీక్షల సమయంలో ఎటువంటి భయాందోళనకు గురికాకుండ పరీక్షలు సజావుగా రాయాలని సూచించారు. కష్టపడి చదివి ఉత్తమ మార్కులు సాధించడం ద్వారా, పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకు రావాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో చావల పురుషోత్తం, ఉపాధ్యాయులు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతులకు ఉపయోగపడే పనులు చేపట్టాలి


మట్టి తవ్వుతున్న ఎమ్మెల్యే జారే

దమ్మపేట, మార్చి 16: రైతులకు ఉపయోగపడే విధంగా ఉపాధి పనులు చేపట్టాలని అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ఈజీఎస్ అధికారులను ఆదేశించారు. మండలంలోని నాచారం పంచాయతీలోని రాళ్లబంజర్ గ్రామంలో జరుగుతున్న జాతీయ ఉపాధి హామీ పనులను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం కలిపిస్తున్న వసతులు, సమస్యలను కూలీలను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మట్టి తవ్వి కూలీలను ఉత్సాహపరిచారు. గ్రామస్థులకు, రైతులకు ఉపయోగపడే పనులు మాత్రమే ఉపాధిపనులలో చేపట్టాలన్నారు. గణేష్‌పాడు గ్రామంలో మర్మతులతో ఆధునీకరించిన పంచాయతీ భవనాన్ని ఎంపీపీ సోయం ప్రసాదు కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కోటగిరి సత్యావతి, ఎంఈవో లక్ష్మి, ఈజీఎస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు

చెక్‌డ్యాం పనులకు శంకుస్థాపన


శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వెంకట్రావు

దుమ్ముగూడెం మార్చి 16:మండలంలోని లచ్చిగూడెం, గుర్రాలబయలు, చర్ల మండలం పెదమిసిలేరు పగిడి వాగుపై రూ10 కోట్లతో చేపట్టనున్న చెక్ డ్యాంల నిర్మాణ పనులకు ఎంఎల్ఏ డాక్టర్ తెల్లం వెంకట్రావు శనివారం శంఖుస్థాపన చేశారు. గుర్రాలబైలు వద్ద కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రేసు లక్ష్మి, ఇరిగేషన్ ఈఈ రాంప్రసాద్, డీఈలు మధుసూదన్‌రావు, తిరుపతి, జేఈలు రాజ్‌సుహాస్, వెంకటేష్, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రామయ్యకు స్వర్ణ తులసార్చన


విరాళం అందజేస్తున్న దృశ్యం

భద్రాచలం, మార్చి 16: భద్రాచలంలోని సీతారామ చంద్రస్వామి వారి ఆలయంలో స్వామి వారికి శనివారం స్వర్ణ తులసార్చన నిర్వహించారు. ఈ ఆర్జిత సేవలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అలాగే నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. నిత్యన్నదాన పథకానికి హైదరాబాద్‌కు చెందిన శ్రీమన్నారాయాణ, నాంచారమ్మ రూ.2లక్షల విరాళం అందజేశారు.

రూ.20లక్షలతో బోరు బావులు

జూలూరుపాడు, మార్చి 16: వేసవిలో ప్రజలకు తాగునీటి ఇబ్బందులను తొలగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టిని కనబరుస్తుందని, దానిలో భాగంగా గ్రామాలలో తాగునీటి వనరులను ఏర్పాటు చేసి నీటిని అందించేందుకు ప్రత్యేక నిధులను కేటాయించినట్టు మిషన్ భగీరథ ఇంట్రావిలేజ్ డీఈ శివయ్య తెలిపారు. మండలంలోని వెంగన్నపాలెం పంచాయతీ పరిధిలోని న్యూకాలనీ, కాకర్ల పంచాయతీ పరిధిలోని దుబ్బతండా, కరివారిగూడెం పంచాయతీలోని తవిసిగుట్ట, కరివారిగూడెం కాలనీ గ్రామాలలో ప్రజలకు తాగునీటిని అందించేందుకు గాను రూ.20లక్షల ఎస్‌డీఎఫ్ నిధులతో ఏర్పాటు చేస్తున్న బోరు బావుల నిర్మాణాలకు శనివారం సొసైటి చైర్మన్, కాంగ్రెస్ జిల్లా నాయకులు లేళ్ల వెంకటరెడ్డితో కలసి డీఈ శంకుస్థాపనలు చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిషన్ భగీరథ నీరు నాలుగు గ్రామాలకు సరఫరా కాకపోవడంతో ప్రజలు నీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతుండటంతో వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణ కోసం ముందస్తు చర్యలో భాగంగా వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ ఆదేశాల మేరకు ఒక్కొక్క గ్రామంలో రూ.5లక్షల నిధులతో బోరులతో పాటు విద్యుత్ మోటర్, పైప్‌లైన్‌ల నిర్మాణాలను చేపడుతున్నట్లు తెలిపారు. వేసవిలో గ్రామాలలో తాగునీటి ఎద్దడిని నివారించే విధంగా ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్టు తెలిపారు.

అందరి సహకారంతో నియోజకవర్గ అభివృద్ధి: జారే

అశ్వారావుపేట, మార్చి 16: అందరి సహకారంతో అశ్వారావుపేట నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించ గలుగుతున్నానని అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అన్నారు. శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతు వంద రోజులో కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చిన ఆరుగ్యారెంటీల అమలు దిశగా పని చేస్తుందని అన్నారు. వాటితో పాటు నియోజక వర్గంలో సిసి రోడ్లు, పాఠశాలల అభివృది, త్రాగునీటి సమస్య, డ్రైనేజి, రహదారుల మర్మతులు కోట్ల రూపాయిలు వెచ్చించి నట్లు తెలిపారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయాన్ని సందర్శించి వినతులు అందించేందుకు వచ్చిన ప్రజలతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. బస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసారు. బస్టాండు పరిసరాలు పరిశుభ్రంగా వుంచాలని ఆర్టీసి అధికారులను ఆదేశించారు. మినీ డిపోను అభివృద్ధి చేసేందుకు ఉన్నతాధికారులతో మాట్లాడారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జారే

ఘనంగా పొట్టి శ్రీరాములు జయంతి

పాల్వంచ టౌన్, మార్చి 16: అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలను శనివారం హైస్కూల్ రోడ్డులో ఘనంగా నిర్వహించారు. పొట్టి శ్రీరాములు విగ్రహానికి డీసీఎంఎస్ చైర్మన్, జిల్లా కాంగ్రెస్ నాయకులు కొత్వాల శ్రీనివాసరావు, ఆర్యవైశ్య మహాసభ పట్టణ, మండల అధ్యక్షులు చలువాది ప్రకాష్, తాటికొండ సురేష్, సీపీఎం నాయకులు దొడ్డ రవికుమార్, చారి తదితరులు మాట్లాడుతూ ప్రత్యేక ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఏర్పాటు కోసం ఆమరణ నిరాహారదీక్ష చేపట్టి తన ప్రాణాలను తృణప్రాయంగా అర్పించిన మహనీయుడు పొట్టి శ్రీరాములు అనికొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ మహిళ అధ్యక్షురాలు పి. రాజాలక్ష్మి, వాసవిక్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు జి. శ్రీనివాస్, ఎం. సాయి, వనిత క్లబ్ అధ్యక్షర, కార్యదర్శులు దుర్గ, శ్రీదేవి, క్లబ్ జోన్‌చైర్మన్ ఆర్. పద్మజ, కంతాల జగదీష్, కుమార్, శ్రీను, ఎస్. వేణు, ఎం. వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

భద్రాచలంలో..


భద్రాచలంలో నివాళులర్పిస్తున్న దృశ్యం

భద్రాచలం: అమరజీవి పొట్టి శ్రీరాములు 123 జయంతిని ఘనంగా భద్రాచలం వాసవీ క్లబ్ జిల్లా, పట్టణ ఆర్య వైశ్య మహాసభ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతిని అధికారికంగా జరపాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షులు చారుగుళ్ల శ్రీనివాస్, ఉప్పల శారద, తోకల నాగేశ్వరరావు, గుప్తా, అద్దంకి మూర్తి, కురిచేటి శ్రీనివాస్, ఎండూరి భద్రం పాల్గొన్నారు.

అశ్వారావుపేట, దమ్మపేటలో..

అశ్వారావుపేట/దమ్మపేట: పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు అశ్వారాపేట, దమ్మపేట, పట్వారిగూడెం గ్రామాలలో వాసవీక్లబ్, పట్టణ, మండల ఆర్యవైశ్య సంఘాల ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్బంగా పొట్టి శ్రీరాముల విగ్రహానికి పూలమాలలు వేశారు. పలువురు మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో వాసవిక్లబ్ అధ్యక్షుడు జల్లిపల్లి దేవరాజు, వైశ్యసంఘం నాయకులు జల్లిపల్లి లోక్‌నాథ్ గుప్తా, సీమకుర్తి వెంకటేశ్వరరావు, కొనిజర్ల ఉమామహేశ్వరరావు, గుడివాడ కృష్ణ, కంచర్ల రామారావు, ఎంపీపి జల్లిపల్లి శ్రీరాంమూర్తి, చీమకుర్తి సుబ్బారావు, సమయమంతుల మహేశ్వరరావు, దారా పుల్లారావు, చందు, శ్రీను,బాలయ్య, ముత్తా సుమాకర్, కర్పూరపు సత్యనారాయణ, దమ్మపేట ఆర్యవైశ్యసంఘం నాయకులు పసుమర్తి రాంబద్రరరావు, దారా ప్రసాదు (డీపి), అత్తులూరి సతీష్, సాయి, ప్రసాదు,పట్వారిగూడెం వాసవీక్లబ్ అధ్యక్షులు పరిటాల నాగచక్రధరావు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

కరకగూడెం, మార్చి 16: ఎక్కడ నుంచో చదువు కోసం వస్తున్న విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని కరకగూడెం తహసీల్దార్ నాగ ప్రసాద్ కోరారు. శనివారం కస్తూర్బా గాంధీ పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వండిన వంటకాలను పరిశీలించిన ఆయన విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. త్వరలో జరగనున్న పది పరీక్షల్లో మంచి ఉత్తీర్ణత సాధించాలని అందుకు విద్యార్థులకు ప్రత్యేక తరగతులు చెప్పాలని ఉపాధ్యాయులను ఆదేశించారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

గుండాల, మార్చి 16: ప్రభుత్వ సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని గుండాల ఎంపీపీ ముక్తి సత్యం, జడ్పీటీసీ వాగబోయిన రామక్క అన్నారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో శనివారం 77 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు పేద, మధ్యతరగతి ప్రజలకు వరంగా మారాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీలు పర్శిక పద్మ, కల్తి క్రిష్ణారావు, తహసీల్దార్ ఇమ్మానియేల్, ఆర్ఐలు నాగేశ్వరరావు, జోగయ్య, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడిగా శ్రీనివాస్


నియామకపత్రం అందజేస్తున్న దృశ్యం

భద్రాచలం, మార్చి 16: కాంగ్రెస్ పార్టీ భద్రాచలం పట్టణ అధ్యక్షుడిగా పరిమ శ్రీనివాస్‌ను నియమిస్తూ డీసీసీ అధ్యక్షుడు పొదెం వీరయ్య శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వులు తక్షణమే అమల్లోకి వస్తుందని అన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ తనకు ఇంత గొప్ప అవకాశం ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ అధిష్టానం, జిల్లా అధ్యక్షుడు పొదెం వీరయ్యకు కృతజ్ఞతలు తెలిపారు.

మౌలిక సదుపాయాలు కల్పిస్తాం

పినపాక, మార్చి 16: మండల పరిధిలో ఉన్న వలస ఆదివాసీ గ్రామాలలో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు తమవంతు కృషి చేస్తున్నట్లు పినపాక ఎంపీవో వెంకటేశ్వరరావు తెలిపారు. శనివారం మండలంలోని వలస ఆదివాసీ గ్రామమైన టేకులగూడెం గ్రామాన్ని సందర్శించారు. ఆ గ్రామంలో నెలకొన్న సమస్యలు, అక్కడి ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గ్రామస్థులను అడిగి తెలుసుకున్నారు. వేసవి సమీపిస్తున్నందున తమకు మంచినీటి ఎద్దడి ఉన్నట్లు తెలపడంతో, స్పందించిన ఎంపీవో రెండు రోజుల్లో శాశ్వత పరిష్కారం చూపుతామని, గ్రామపంచాయతీ వాటర్ ట్యాంకులతో మంచినీటి సరఫరా చేస్తామని హామీనిచ్చారు.

సింగరేణి ఉచిత వైద్య శిబిరం

మణుగూరుటౌన్, మార్చి 16: మణుగూరు ఏరియా రైల్వే స్టేషన్ సమీపంలోని సింగరేణి పునరావాస పద్మగూడెం గ్రామంలో శనివారం సింగరేణి సేవా సమితి, వైద్యఆరోగ్య విభాగంల ఆద్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన ప్రారంభ కార్యక్రమంలో సింగరేణి ఏరియా ఆసుపత్రి వైద్యులు రవికుమార్ మాట్లాడారు. గ్రామంలో పరిసరాలను ఎల్లప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వ్యక్తిగత పరిశుభ్రతను తప్పక పాటించాలని సూచించారు. అనంతరం శిబిరానికి హాజరైన స్త్రీ, పురుషులు, వృద్దులు, చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. సీజనల్ వ్యాదులతో పాటు బీపీ, షుగర్ వాధిగ్రస్తులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు.

సాగునీరు అందించడమే లక్ష్యం: పాయం


జేసీబీని నడుపుతున్న పాయం

కరకగూడెం, మార్చి 16: నియోజకవర్గంలోని ప్రతి ఎకరాకు సాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం మండలంలోని కన్నాయిగూడెం పంచాయితీ బంగారుగూడెం పెద్దవాగు వద్ద రూ.12కోట్ల 63 లక్షల వ్యయంతో నిర్మించనున్న చెక్‌డ్యాం పనులకు అధికారులతో కలిసి ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు శంఖుస్థాపన చేశారు. అనంతరం జేసీబీని నడి గొయ్యి తీశారు. ఈ సందర్భంగా పాయం మాట్లాడుతూ.. వట్టివాగు పనులు ఇప్పటికే ప్రారంభం అయ్యిందని.. త్వరలో పులుసుబొంత ప్రాజెక్టు పనులకు ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు అవుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఏఈ సక్రు, తహసీల్దార్ నాగ ప్రసాద్, మండల నాయకులు ఇక్బాల్ హుస్సేన్, తోలెం నాగేశ్వరావు, జలగం కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పొటోరైటప్‌:16ఏఎస్‌పియం02 నెల్లిపాక రాళ్లవాగుపై వంతెన నిర్మాణానికి భూమిపూజ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

వంతెన నిర్మాణానికి ఎమ్మెల్యే భూమిపూజ

అశ్వాపురం: మండల పరిధిలోని నెల్లిపాక-ఆనందాపురం గ్రామాల మధ్య రాళ్లవాగుపై వంతెన నిర్మాణానికి శనివారం ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు భూమిపూజ నిర్వహించారు. రూ.3కోట్ల 23లక్షల అంచనా వ్యయంతో ఈ బ్రిడ్జి నిర్మించనున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ముత్తినేని సుజాత, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు షర్ఫుద్దీన్, నెల్లిపాక సింగిల్ విండో చైర్మన్ తుక్కాని మధుసూదన్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఓరుగంటి భిక్షమయ్య పాల్గొన్నారు.

ప్రతీ ఒక్కరికీ పథకాలు వర్తిస్తాయి

ఆళ్లపల్లి: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలు అర్హులైన నిరుపేదలందరికీ వర్తిస్తాయని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. కళ్యాణలక్ష్మీ చెక్కులను ఆయన శనివారం రైతువేదికలో అందజేశారు. అనంతరం పాతురు గ్రామంలో ఓ వివాహ వేడుకకు హాజరయ్యారు.

గోడమీద పిల్లులకు పదవులిస్తే ఊరుకోం

దుమ్ముగూడెం, మార్చి 16: ఎన్నడూ కాంగ్రెస్ జెండా పట్టుకోని, గోడమీద పిల్లుల వంటి నాయకులకు మండల నాయకత్వం అప్పగిస్తే ఊరుకునేది లేదని కాంగ్రెస్ మండల తాజా మాజీ అధ్యక్షుడు లంకా శ్రీనివాసరావు హెచ్చరించారు. ములకపాడులో శనివారం సమావేశం నిర్వహించారు. నిజమైన కార్యకర్తలను పట్టించుకునే వరకూ ఉద్యమిస్తామని తెలిపారు. నాయకత్వం అప్పగించే విషయంలో పొరపాటు జరిగితే సహించబోమని డీసీసీ అధ్యక్షుడు పొదెం వీరయ్యకు అల్టిమేటం జారీ చేశారు. జిల్లా, మండల నాయకులు కనుబుద్ది దేవా, దర్శి సాంబశివరావు, లంకా శివకుమార్, మాజీ సర్పంచిలు నాగేంద్రబాబు, చిన్నారావు, అప్పిరెడ్డి, ఎంపీటీసీ భీమరాజు, చంటి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్షా సామగ్రి పంపిణీ

మణుగూరు, మార్చి 16: మణుగూరులోని జడ్పీ కో ఎడ్యూకేషన్ పాఠశాలలో శనివారం పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే 134మంది విద్యార్థులకు పొంగులేటి యువసేన అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి, సీఐ సతీష్‌కుమార్ పరీక్ష సామాగ్రిని అందిచారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. విద్యార్థులు ఒత్తిడికి లోనుకాకుండా పరీక్షలకు హాజరుకావాలన్నారు. మనోధైర్యంగా ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కోవాలని సూచించారు. విద్యార్థులు మనోనిబ్బరం కోల్పోరాదని సూచించారు. పాస్, ఫెయిలనేది సహజమని, రెండింటినీ సమానంగా తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో నాయకులు పి నవీన్, సామా శ్రీనివాసరెడ్డి, శివ, సాంబశివరావు, కరుణాకర్, కిరణ్, శ్రీను, అఖిల్, అనిల్ రెడ్డి, ప్రీతమ్, వహీద్, రామయ్య, రామ్‌సాయి, రవికుమార్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలకు సౌండ్ సిస్టమ్ వితరణ

అశ్వాపురం, మార్చి 16: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు పూర్వ విద్యార్థులు సౌండ్ సిస్టమ్‌ను వితరణగా అందజేశారు. 1985-86 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు తామ చదువుకున్న పాఠశాలకు అవసరమయ్యే వనరులను ఏర్పాటు చేస్తూ వస్తున్నారు. ఇందులో భాగంగా పాఠశాలకు రూ.35 వేల రూపాయలను వెచ్చించి విద్యార్థుల కోసం ఈ వితరణ అందించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు తుళ్లూరి ప్రకాష్, నక్కబోయిన వెంకటరమణ, రామదాసు, బోయపాటి సావిత్రి, దొడ్డ నాగమణి, ప్రదానోపాధ్యాయురాలు యోగిత వాణి తదితరులు పాల్గొన్నారు.